పాఠకులకు, ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు
ప్రజాస్ఫూర్తి దీపావళి శుభాకాంక్షలు

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 30-10-2024 | సంపుటి - 21 | సంచిక -194 | రూ : 4 | పేజీలు: 8




# కేసీఆర్ అంటేనే తెలంగాణ చరిత్ర

## మీరా ఆయన పేరును తుడిచేది..?

- చిట్టినాయుడు రేవంత్ చెప్పులు మోసిన నాడు మా నాయకుడు ఉద్యమానికి ఊపిరి పోశాడు..
- తెలంగాణ కోసం పదవులు తృణప్రాయంగా వదిలేశాడు..
- ఉద్యమకారులపై గన్ను ఎక్కుపెట్టలేదా...?
- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ కౌంటర్

**తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య మాటల యుద్ధం నెలకొంది. కేసీఆర్‌ను టార్గెట్ చేస్తూ రేవంత్ చేసిన సంచలన వ్యాఖ్యలకు తాజాగా కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. రేవంత్ చెప్పులు మోసిన నాడు కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశాడని తెలిపారు. పదవులు కోసం రేవంత్ పరితపిస్తున్న కాలంలో కేసీఆర్ తనకు ఉన్న పదవిని తృణప్రాయంగా వదిలేశాడని గుర్తుచేశారు. 'నువ్వా కేసీఆర్ పేరును తుడిచేది? తెలంగాణ చరిత్ర కేసీఆర్'అంటూ ఘాటుగా స్పందించారు. ఈ మేరకు ట్విటర్‌లో కేటీఆర్.. 'నువ్వు చెప్పులు మోసిన నాడు ఆయన ఉద్యమానికి ఊపిరి పోశాడు. నువ్వు పదవుల కోసం పరితపిస్తున్న నాడు, ఆయన ఉన్న పదవిని తృణప్రాయంగా వదిలేశాడు. నువ్వు ఉద్యమకారుల మీద గన్ను ఎక్కుపెట్టిన నాడు, ఉద్యమానికి తన ప్రాణాన్ని పణంగా పెట్టాడు. నువ్వు సాధించుకున్న తెలంగాణను సంపెటందుకు బ్యాగులు మోస్తున్ననాడు, ఆయన తెలంగాణ భవిష్యత్‌కు ఊపిరి పోశాడు. చిట్టినాయుడు. నువ్వా! పేరును తుడిచేది? తెలంగాణ చరిత్ర కేసీఆర్.'అని పేర్కొన్నారు.



# డ్రగ్స్ టెస్ట్‌కు మేం రెడీ

- యూరిన్ డబ్బా పట్టుకుని ఉన్నాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ ఎదురు చూస్తున్నారు..
- ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌తో కాదు
- రేవంత్ రెడ్డితో పంచాయితీ
- ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక డైవర్ట్ పాలిటిక్స్
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్

**తెలంగాణ బ్యూరో :** డ్రగ్ టెస్ట్‌కు మేం రెడీ..సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ సవాల్ విసిరారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. తన పంచాయితీ కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌తో కాదని, సీఎం రేవంత్‌రెడ్డితో అన్నారు. 'డ్రగ్స్ కేసులో నన్ను ఇరికించాలని రేవంత్ రెడ్డి ప్రయత్నం చేశారు. కౌశిక్ రెడ్డిని ట్రాప్ చేయలేదని ఇంటిలిజెన్స్ చీఫ్‌ను ప్రెస్‌మీట్ పెట్టి చెప్పండి. నేను రేవంత్‌రెడ్డికి సవాల్ విసురుతున్నా. రేవంత్ తన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో డ్రగ్స్ టెస్టుకు రావాలి. మేం యూరిన్ డబ్బా పట్టుకుని రెడీగా ఉన్నాం. మా ఎమ్మెల్యేలందరూ ఎదురు చేస్తున్నారు. ఇప్పటి వరకు మమ్మల్ని పిలవలేదు. ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారు. రేవంత్ డ్రగ్స్ గురించి మాట్లాడితే చిత్తశుద్ధితో మాట్లాడాలి. నన్ను ట్రాప్ చేసినట్లు రాజ్‌పాకాల కుటుంబాన్ని ఇరికించాలని చూశారు. కేసీఆర్ పేరు తలుచుకోకుండా రేవంత్‌రెడ్డి మీటింగ్ జరిగిందా. రేవంత్‌రెడ్డి చెరిపేస్తే చెరిగిపోయేది కాదు, కేసీఆర్ పేరు. రేవంత్‌రెడ్డి పాలనలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదు'అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అన్నారు.

## ఒరిస్సా టు హైదరాబాద్‌కు..

- మియాపూర్‌లో గంజాయి పట్టివేత
- ముగ్గురు అరెస్టు, 21కిలోలు స్వాధీనం
- పరారీలో ప్రధాన నిందితుడు

**శేరిలింగంపల్లి :** మియాపూర్ లో గంజాయి రవాణా చేస్తున్న నలుగురు సభ్యుల ముఠా పట్టుబడింది. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం ఉదయం మియాపూర్ మెట్రో స్టేషన్ కల్వరి టెంపుల్ రోడ్డులో మియాపూర్ పోలీసులు, ఎస్ ఓటీ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మహీంద్రా కారులో 21 కిలోల గంజాయిని ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు . ముగ్గురు నిందితుల్లో ఒరిస్సాకు చెందిన ఇద్దరు, హైదరాబాద్‌కు చెందిన ఒకరిని గుర్తించారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. కారుతోపాటు గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు.

# డ్రగ్స్ టెస్టులకు శాంపిల్స్

- హైదర్‌గూడలోని అపోలో హాస్పిటల్‌కు వెళ్లిన ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్
- ఎన్నికల్లో భార్య, కూతురితో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని ఓటర్లకు బ్లాక్ మెయిల్
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆంబోతులా మాట్లాడుతున్నాడని మండిపాటు



**తెలంగాణ బ్యూరో :** జన్వాడ ఫామ్ హౌస్ ఘటన నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి కాంగ్రెస్ నేతలకు మధ్య చోటు చేసుకున్న డ్రగ్ టెస్టుల సవాళ్లు, ప్రతి సవాళ్ల మధ్య బుధవారం ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ డ్రగ్స్ టెస్టుల కోసం శాంపిల్స్ ఇచ్చారు. హైదర్‌గూడలోని అపోలో హాస్పిటల్‌కు వచ్చి డ్రగ్స్ టెస్టుల కోసం శాంపిల్స్ ఇచ్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో భార్య, కూతురితో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని ఓటర్లు బ్లాక్ మెయిల్ చేసి గెలిచిన కౌశిక్ రెడ్డి ఓ ఆంబోతులా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. తన బాస్ కేటీఆర్‌ను, బీఆర్ఎస్ 28మంది ఎమ్మెల్యేలను తీసుకుని డ్రగ్ టెస్టులకు వస్తామని చెప్పారన్నారు. ఎంపీ అనిల్ కుమార్ టెస్టులకు రావాలని కౌశిక్ రెడ్డి చేసిన సవాల్‌కు స్పందించి డ్రగ్ టెస్టులకు శాంపిల్స్ ఇచ్చామన్నారు. కానీ, సవాల్ విసిరిన కౌశిక్ రెడ్డి, ఆయన బాస్ పత్తా లేరని ఎద్దేవా చేశారు. కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటాడనే అనుమానం ఉందని, ఆయన కూడా డ్రగ్ టెస్ట్ చేయించుకుని తనను తాను ప్రూవ్ చేసుకోవాలని బల్మూరి డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఒకవైపు రాష్ట్రాన్ని డ్రగ్ రహితంగా మార్చాలని ప్రయత్నిస్తుంటే ప్రతిపక్ష కేటీఆర్ కుటుంబం డ్రగ్స్ వినియోగాన్ని ప్రోత్సహించేలా వ్యవహరిస్తుందని ఆరోపించారు.

## మంత్రి కొండా సురేఖపై పరువునష్టం కేసు

# నవంబర్ 13కు పోస్ట్‌పోన్

- నాగార్జున, కేటీఆర్ పిటిషన్లపై విచారణ వాయిదా



**తెలంగాణ బ్యూరో :** మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం పిటిషన్ పై విచారణ వాయిదా పడింది. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు మెజిస్ట్రేట్ సెలవులో ఉండడంతో నవంబర్ 13కు ఇన్‌చార్జి జడ్జి వాయిదా వేశారు. కేసులో బుధవారం తుల ఉమ, బాల్క సుమన్, సత్యవతి రాథోడ్ వాంగ్మూలాలను నమోదుచేయాల్సి ఉన్నది. ఇప్పటికే కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్ వాంగ్మూలాలను రికార్డు చేసిన విషయం తెలిసిందే. తనపై నిరాధారమైన ఆరోపణలు చేసిన మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ పరువు నష్టం దావా పిటిషన్ దాఖలు చేశారు. గత విచారణ సందర్భంగా తన గురించి మంత్రి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ కోర్టుకు రాతపూర్వంగా కమర్పించారు. మొత్తం 23 రకాల ఆధారాలను అందించారు. సినీనటుడు అక్కినేని నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసులో వివరణ వాయిదా పడింది. కేసులో మంత్రి కొండా సురేఖ తన వాగ్మూలం ఇచ్చేందుకు కోర్టుకు హాజరుకావాల్సి ఉన్నది. జడ్జి సెలవులో ఉండడంతో వచ్చే నెల 13కు పోస్ట్‌పోన్ అయింది.




## శంషాబాద్ విమానాశ్రయానికి

# బాంబు బెదిరింపు

- 6 విమానాలకు బెదిరింపు కాల్స్ అప్రమత్తమైన భద్రతా సిబ్బంది
- ఆలస్యంగా నడిచిన పలు విమానాలు

**తెలంగాణ బ్యూరో :** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 6 విమానాలకు బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది విమానాశ్రయంలో తనిఖీలు నిర్వహించారు. దేశంలోని వివిధ విమానయాన సంస్థలు నడుపుతున్న 100కుపైగా విమానాలకు మంగళవారం బాంబు బెదిరింపులు వచ్చినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. దీంతో 16 రోజుల వ్యవధిలో 510కు పైగా దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు బెదిరింపులు వచ్చినట్లైంది. మరోవైపు విమానాలకు బాంబు బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో ఈ కుట్ర వెనకాల ఓ పుస్తక రచయిత ఉన్నట్లు మహారాష్ట్ర పోలీసులు గుర్తించారు. ఆ వ్యక్తి గోండియాకు చెందిన జగదీశ్ ఉయికే అని నాగ్‌పూర్ పోలీసులు తెలిపారు. గతంలో ఉగ్రవాదంపై పుస్తకం రచించిన ఈ వ్యక్తి 2021లో ఓ కేసులో అరెస్టు అయినట్లు వెల్లడించారు. ఈ వ్యక్తి ఇమెయిల్ ద్వారా పలు విమానయాన సంస్థలకు నకిలీ బాంబు బెదిరింపు సందేశాలు పంపించాడని, దీని కారణంగా పలు విమానాలు ఆలస్యంగా నడిచినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## ముగ్గురు కేజీబీవీ విద్యార్థినుల పరిస్థితి విషమం?

- హైదరాబాద్‌కు తరలింపు
- అపోలో హాస్పిటల్‌లో చికిత్స
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు

**తెలంగాణ బ్యూరో :** ముత్తారం కేజీబీవీలో అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. 53మంది విద్యార్థినులు ఆదివారం రాత్రి పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానలో చేరగా, ఆరోగ్యం కుదుట పడడంతో సోమవారం 39 మందిని, మంగళవారం 6 గురిని డిశ్చార్జి చేశారు. 8 మందిలో నలుగురికి దగ్గు తీవ్రత తగ్గకపోవడంతో సోమవారం రాత్రి కరీంనగర్‌కు తరలించారు. ఆరోగ్య పరిస్థితి మెరుగు పడకపోవడంతో రేవతి, సునీత, రక్షితను హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని ముత్తారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో దాదాపు 60 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే వారిని పెద్దపల్లి దవాఖానకు తరలించి చికిత్స అందించారు. తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పాఠశాల పరిధిలో గడ్డి మందు కొట్టించగా, అదే గడ్డిని ఆదివారం విద్యార్థినులతో తొలగించారు.

# దేశంలో తొలిసారి సమగ్ర కుల సర్వే

- అన్ని ఏర్పాట్లు చేశాం
- త్వరలోనే అఖిల పక్ష సమావేశం
- నవంబర్ 6నుంచి కుల గణన చేపడుతాం
- బీసీ సంక్షేమ, రావాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్



**తెలంగాణ బ్యూరో :** దేశంలో తొలిసారి సమగ్ర కుల సర్వే జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని బీసీ సంక్షేమ, రావాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో కులగణనపై మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. నవంబర్ 6 నుంచి కుల గణన చేపట్టనున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో సమగ్ర సర్వే సరిగ్గా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి సూచన ప్రకారం త్వరలోనే అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నేతలు.. సర్వేలో పాల్గొనే అధికారులకు సహకరించాలని సూచించారు. పార్టీ పరంగా కూడా బాధ్యులను వేస్తామని, అధికారులకు ఇబ్బందులు లేకుండా కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు. కుల గణన చేయాలని ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించడమే ధ్యేయంగా బీఆర్ఎస్ నేతలు పెట్టుకున్నారని మండిపడ్డారు. ఏ కార్యక్రమం చేసినా విమర్శలు చేయడమే పనిగా ప్రతిపక్షం పెట్టుకుందని విమర్శించారు. '50శాతం పైబడిన బీసీ వర్గాలకు మేలు జరుగబోతోంది. దీనిని అయిన మెచ్చుకుంటారు అనుకున్నాం. దీపావళికి దావత్ చేసుకుంటే తప్పేంది అంటున్నారు. మీరు అప్పులు చేస్తే మేము వడ్డీలు కడుతున్నాం. చెప్పని కార్యక్రమాలు చేస్తున్నాం. డీఎస్సీ నిర్వహించాం. వెనుకబడిన కులాల మీద బీఆర్ఎస్‌కు ప్రేమ లేదు. పార్టీ అధ్యక్షుడు, ఫ్లోర్ లీడర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు మీరే ఉన్నారు. మా పీసీసీ చీఫ్ బలహీన వర్గాల నేత. కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి ప్రెస్ నోట్ అయిన విడుదల చేయాలి. లేదంటే మీ పార్టీ కనుమరుగు అవుతుంది'అని తెలిపారు.

# తేమ పేరుతో మెలిక

- ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో
- తెల్లబంగారానికి దక్కని మద్దతు ధర
- కుదేలవుతున్న పత్తి రైతులు



**తెలంగాణ బ్యూరో :** పత్తి రైతు కుదేలవుతున్నాడు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో తెల్ల బంగారానికి మద్దతు ధర దక్కడంలేదు. తేమ పేరుతో సీసీఐ, ప్రైవేట్ వ్యాపారులు మెలిక పెడుతున్నారు. నేటి వరకు సీసీఐ 4,235 క్వింటాళ్లు కొనుగోలు చేసింది. ప్రైవేట్ వ్యాపారులు మాత్రం 26,484 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. గురువారం నుంచి నాలుగు రోజుల పాటు పత్తి కొనుగోళ్లను నిలిపివేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పత్తి మద్దతు ధరను 7,521గా ప్రకటించింది. ఒక్క రైతుకు కూడా ఇప్పటివరకు ఆదిలాబాద్‌లో ఇది దక్కలేదు. తమను ఏ ప్రజాప్రతినిధి పట్టించుకోవడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.





## నూతన ఏపీ భవన్ నిర్మాణానికి టెండర్లు

- 'రీ డెవలప్‌మెంట్ ఆఫ్ ఏపీ భవన్'పేరుతో డిజైన్లు
- 11.53 ఎకరాల్లో భవనం

**ఏపీబ్యూరో :** ఢిల్లీలో నూతన ఏపీ భవన్ నిర్మాణానికి ఏపీ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ మొదలుపెట్టింది. 'రీ డెవలప్‌మెంట్ ఆఫ్ ఏపీ భవన్'పేరుతో డిజైన్లకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. 11.53 ఎకరాల్లో ఏపీ భవన్ నిర్మాణం కోసం డిజైన్లకు టెండర్లను ఆహ్వానించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఢిల్లీలోని ఏపీ భవన్‌ను విభజించారు. ఎన్నికలకు ముందు 2 తెలుగు రాష్ట్రాల అధికారులు చర్చించి భవన్ విభజనను ఖరారు చేశారు.

# ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి నిధులు

- ఉచిత గ్యాస్ సబ్సిడీ.. పెట్రోలియం సంస్థలకు
- చెక్కు అందజేసిన సీఎం చంద్రబాబు



**ఏపీ బ్యూరో :** సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి ఏపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పథకానికి ఖర్చయ్యే నిధులను సీఎం చంద్రబాబు పెట్రోలియం సంస్థలకు అందజేశారు. అమరావతిలోని సచివాలయంలో హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఈ సబ్సిడీ మొత్తాన్ని అందించారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఇచ్చేందుకు అయ్యే రూ.2,684 కోట్ల ఖర్చుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో మొదటి ఉచిత సిలిండర్‌కు ఖర్చు అయ్యే రూ.894 కోట్లను పెట్రోలియం సంస్థలకు ప్రభుత్వం అందించింది. దీపం2 పథకంలో భాగంగా ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా అందించనున్నది. మూడు విడతల్లో ప్రభుత్వం మూడు గ్యాస్ సిలిండర్లకు అయ్యే ఖర్చు సొమ్మును విడుదల చేయనున్నది. ఈ నెల 29వ తేదీ నుంచి ప్రభుత్వం ఈ పథకం కింద గ్యాస్ బుక్ చేసుకునే అవకాశాన్ని లబ్ధిదారులకు కల్పించింది. గ్యాస్ సిలిండర్ అందిన 48 గంటల్లో లబ్ధిదారులు సిలిండర్‌కు వెచ్చించిన సొమ్ము వారి ఖాతాలో జమ కానున్నది.



## ఎంవోయూపై జగన్ సంతకం

- బెయిల్ రద్దవుతుందని సంతకం చేసినప్పుడు తెలియదా?
- ఈడీ అటాచ్ చేసింది షేర్లు కాదు..
- రూ.32కోట్ల విలువైన కంపెనీ స్థిరాస్తి
- జగన్‌తో ఆస్తుల వివాదం నేపథ్యంలో స్పందించిన షర్మిల

**ఏపీబ్యూరో :** వైసీపీ అధ్యక్షుడు జగన్ బెయిల్ రద్దుకు కుట్రగా ఆ పార్టీ నేతలు పేర్కొనడం ఈ శతాబ్దపు పెద్ద జోక్ అని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. జగన్‌తో ఆస్తుల వివాదం నేపథ్యంలో ఆమె మరోసారి స్పందించారు.'ఈడీ అటాచ్ చేసింది షేర్లు కాదు.. రూ.32కోట్ల విలువైన కంపెనీ స్థిరాస్తి. షేర్ల బదలాయింపుపై ఎలాంటి ఆంక్షలు, అభ్యంతరాలు లేవు. స్టేటస్‌కో ఉన్నది షేర్లపై కాదు. గతంలోనూ ఎన్నో కంపెనీల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. వాటికి స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్, బదిలీలు మాత్రం ఆపలేదు. ఈడీ అటాచ్ చేసినందువల్ల షేర్ల బదిలీ చేయకూడదనడం హాస్యాస్పదం. నాకు 100 శాతం వాటాలు బదలాయిస్తామని ఎంవోయూపై జగన్ సంతకం చేశారు. బెయిల్ రద్దవుతుందని సంతకం చేసినప్పుడు తెలియదా? 2021లో రూ.42కోట్లకు క్లాసిక్ రియాలిటీ, సండూర్, సరస్వతి షేర్లను విజయమ్మకు ఎలా అమ్మారు? బెయిల్ రద్దవుతుందని షేర్లు విక్రయించినప్పుడు తెలియదా? అలా అమ్మడం స్టేటస్ కోను ఉల్లంఘించినట్లు కాదా? షేర్ల బదిలీకి, బెయిల్ రద్దుకు సంబంధం లేదని మీకు తెలుసు. షేర్లు విక్రయించి ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నారు. జగన్ బెయిల్‌కు వచ్చిన ఇబ్బందేమీ లేదని విజయమ్మకు తెలుసు.'అని షర్మిల పేర్కొన్నారు.

# పోలీసుల పేరుతో కిడ్నాప్

- విజయనగరం జిల్లాలో కిడ్నాప్ ఘటన కలకలం
- రూ.4లక్షలు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరింపు
- నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు




**ఏపీబ్యూరో :** విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలో కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలను బుధవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మీడియా సమావేశంలో వెల్లడించారు.'ఈ నెల 28న ఉదయం 5.30 గంటలకు ఎస్.కోట మండలం కొట్టాం గ్రామానికి చెందిన దంతులూరి వెంకట సూర్యనారాయణరాజు ఇంటికి ఇద్దరు వ్యక్తులు కారులో వచ్చారు. తాము పోలీసులమని, విచారణ నిమిత్తం తీసుకెళ్తున్నట్టు చెప్పారు. ఆ తర్వాత సూర్యనారాయణరాజు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ.4లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించారు. కిడ్నాప్ ఘటనపై ఈ నెల 29న సూర్యనారాయణరాజు అల్లుడు కాకార్లపూడి శివప్రసాద్ ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ భాస్కరరావు బుధవారం ఉదయం 5గంటలకు ఉసిరి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. రెండు కార్లలో వస్తున్న వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. గమనించిన పోలీసులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, కిడ్నాప్ వ్యవహారం బట్టబయలైంది. ఏడుగురు కిడ్నాపర్ల నుంచి సూర్యనారాయణరాజును పోలీసులు రక్షించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు విశాఖపట్నం మధురవాడ కొమ్మాది ప్రాంతానికి చెందిన కసిరెడ్డి రాజుకు, బాధితుడు సూర్యనారాయణరాజుకు దాదాపు 20 ఏళ్లుగా పరిచయం ఉంది. కొంతకాలంగా కసిరెడ్డి రాజు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. సూర్యనారాయణరాజు ఆస్తిపరుడని తెలిసి.. తన ఇద్దరు కుమారులు ప్రవీణ్, సాయి వారి స్నేహితులు మరో నలుగురితో కలిసి కసిరెడ్డి రాజు కిడ్నాప్‌నకు ప్రణాళిక వేశాడు. ఇందులో భాగంగా ఈనెల 28న అతని ఇంటికి వెళ్లి పోలీసులమని చెప్పి కిడ్నాప్ చేశారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశామని, మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నాం'అని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

# పంటలకు మద్దతు ధర కల్పించాలి

- 2017 జీవోను రద్దు చేసి కొత్త జీవోను అమలు పర్చాలి
- పోలవరం ముంపు నిర్వాసిత యువతకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి
- పోడు భూములకు పట్టాలి ఇవ్వాలి
- సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా డిమాండ్




**కుక్కునూరు డివిజన్/వేలేరుపాడు :** రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా డిమాండ్ చేసింది. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా ఏలూరు జిల్లా నిర్మాణ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలపై పలు తీర్మానాలను సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా ఏలూరు జిల్లా కార్య దర్శి షేక్ గౌస్ ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎంఎస్పీ ప్రత్తి, వరి, మిర్చి, మినుము, పెసర, కంది ఇతరత్రా 101 పంటలకు చట్టం చేయాలన్నారు. ఏపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. పోలవరం ముంపు నిర్వాసితులకు కేంద్ర ప్రభుత్వం పోలవరానికి కేటాయించిన రూ.12వేల కోట్ల నుంచి 2017 జీవోను రద్దుచేయాలన్నారు. 18 ఏండ్లు నిండిన యువతకు పరిహారం ఇవ్వాలన్నారు. నవంబర్‌లో సర్దుబాటు పేరిట కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై కరెంట్ చార్జీలు పెంచి రూ.6వేల కోట్ల భారం మోపే ఆలోచనను విరమించుకోవాలన్నారు. గిరిజన నిరుద్యోగ నియమాకాల్లో జీవో నెంబర్ 3ను సుప్రీంకోర్టు రద్దు చేసిన దానిని వెంటనే చట్టబద్ధం చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మెగా డీఎస్సీ ప్రకటించక ముందే, ఏజెన్సీ ప్రాంతాల్లో కోట రామచంద్రాపురం ఐటీడీఏ ద్వారా ప్రత్యేక గిరిజన డీఎస్సీని ప్రకటించాలన్నారు. జీలుగుమిల్లి మండలం వంక వారి గూడెంలో నేవీ కర్మాగారం నిర్మించే ఆలోచనను విరమించాలన్నారు. ఆదివాసీలు, ఇతర పేదలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, బాసినేని సత్యనారాయణ, కట్టం వీరా స్వామి, కట్టం ముత్యాలరావు, కన్నయ్య, మల్ల శ్రీను మేడేపల్లి సర్పంచ్ ఎంపీటీసీ రాంబాబు, తుర్రం తమ్మయ్య, నార్లవరం సర్పంచ్ ఎంపీటీసీ, రంగమ్మ, కే రత్తమ్మ, తిరుమలాపురం సర్పంచ్ సోడే విజయ, ఉప సర్పంచ్ ఓకే బుచ్చయ్య, పీఓడబ్ల్యూ డివిజన్ నాయకురాలు తోడం సీత, అరుణోదయ డివిజన్ నాయకుడు కారం భాస్కర్ పాల్గొన్నారు.




## చైనా మరో ముందడుగు..

- తొలిసారి మహిళా వ్యోమగామిని
- అంతరిక్షంలోకి పంపిన దేశం
- లాంగ్‌మార్చ్-2ఎఫ్ అనే భారీ రాకెట్‌ను వాడారు..
- వెల్లడించిన సీఎంఎస్ఏ ప్రతినిధి

**నేషనల్ బ్యూరో :** చైనా తమ దేశం తరఫున ఓ మహిళా వ్యోమగామిని తొలిసారి అంతరిక్షంలోకి పంపింది. తాజాగా గన్సు ప్రావిన్స్‌లోని జియుక్వియాన్ స్పేస్ సెంటర్ నుంచి షెంఝూ19 మిషన్‌లో భాగంగా ముగ్గురు యువ వ్యోమగాములను అంతరిక్ష కేంద్రం తియాంగాంగ్‌కు తరలించింది. ఇందుకోసం లాంగ్‌మార్చ్2ఎఫ్ అనే భారీ రాకెట్‌ను వాడారు. వ్యోమగాముల్లో 34 ఏళ్ల మహిళా స్పేస్ ఫ్లైట్ ఇంజినీర్ వాంగ్ హవూజె కూడా ఉన్నారు. దాదాపు ఆరు గంటల పాటు ప్రయాణించిన వారు స్పేస్ స్టేషన్‌కు చేరుకొన్నారు. వీరు ప్రయాణించిన స్పేస్‌షిప్ అంతరిక్ష కేంద్రం కోర్‌మాడ్యూల్ తియాన్హేతో అనుసంధానమైంది. ఈ ముగ్గురు వ్యోమగాములు ఆరు నెలలపాటు అక్కడే ఉండి వివిధ ప్రయోగాలను, స్పేస్‌వాక్‌ను నిర్వహిస్తారు. దీనినుంచి వచ్చిన అనుభవంతో 2030 నాటికి చంద్రుడి పైకి యాత్రను చేపడతారు. ఈ ప్రయోగం విజయవంతమైందని చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజెన్సీ (సీఎంఎస్ఏ) ప్రకటించింది. 'వీరు వివిధ రంగాలకు చెందిన మొత్తం 86 ప్రయోగాలు నిర్వహిస్తారు. మా మిత్రదేశాల వ్యోమగాములకు కూడా శిక్షణ ఇచ్చే అంశంపై చర్చలు జరుగుతున్నాయి'అని సీఎంఎస్ఏ ప్రతినిధి చెప్పారు.

# ఎంవీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం

- మహా వికాస్ అఘాడీ కూటమి పక్షాలు క్రమశిక్షణతో పోరాడతాయి..
- తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవు
- 'మహాయుతి'కూటమి పనైపోయింది..
- మహారాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి రమేశ్ చెన్నితాల



**నేషనల్ బ్యూరో :** మహారాష్ట్రలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి రమేశ్ చెన్నితాల కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఇక 'మహాయుతి'కూటమి పనైపోయిందని జోస్యం చెప్పారు. మహావికాస్ అఘాడీలోని అన్ని పార్టీలకు కాంగ్రెస్ సమాన గౌరవం ఇచ్చిందని, అందుకే అందులో ఎలాంటి అలకలు, కొట్లాటలు లేవని ఆయన అన్నారు. తిరుగుబాటుదారులందరూ నామినేషన్లు ఉపసంహరించుకునేలా చూడాలని తమ పార్టీ నాయకుడు నసీం ఖాన్‌ను సమాజ్‌వాదీ పార్టీతో మాట్లాడాల్సిందిగా కోరామన్నారు. నవంబర్ 4 నాటికి (రెబెల్స్ నామినేషన్ల) సమస్య పరిష్కారమవుతుందని తాము ఆశిస్తున్నామని తెలిపారు. అయితే 'మహాయుతి'లో శివసేన, ఎన్సీపీలకు దక్కాల్సిన సీట్లను కూడా బీజేపీ లాగేసుకుందని విమర్శించారు. ఎన్నికల్లో మహాయుతి నేతలు పోటీ చేస్తున్నట్టు లేదని, కేవలం బీజేపీ నేతలే పోటీ చేస్తున్నట్లుందన్నారు. మహారాష్ట్రలో ఎంవీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని రమేశ్ చెన్నితాల తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ కూటమి పక్షాలు క్రమశిక్షణతో పోరాడతాయని చెప్పారు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని పేర్కొన్నారు.



# స్టెప్పులేశాడు..

- దీపావళి వేడుకల్లో హిందీ హిట్ పాటకు
- డ్యాన్స్ చేసిన యూఎస్ దౌత్యవేత్త
- నెటిజన్లను ఆకట్టుకుంటున్న డ్యాన్స్ వీడియో

**నేషనల్ బ్యూరో :** భారత్‌లో అమెరికా రాయబారిగా ఉన్న ఎరిక్ గార్సెట్టి మరోసారి తన డ్యాన్స్‌తో ఆకట్టుకున్నారు. ఢిల్లీలోని అమెరికా దౌత్య కార్యాలయంలో బుధవారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గార్సెట్టి స్టేజ్‌పై బాలీవుడ్ హిట్ పాటకు ఎంతో ఉత్సాహంగా స్టెప్పులేశారు. విక్కీ కౌశల్ నటించిన 'బ్యాడ్ న్యూజ్'చిత్రంలోని 'తౌబా తౌబా..'ని సాగే హిట్ పాటకు ఎంతో ఉత్సాహంగా డ్యాన్స్ చేశారు. సంప్రదాయ కుర్తా పైజామా ధరించి, కళ్లజోడు పెట్టుకుని గార్సెట్టి చేసిన డ్యాన్స్ వీడియో ప్రస్తుతం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. గార్సెట్టి ఇలా తన డ్యాన్స్ స్కిల్స్‌తో ఆకట్టుకోవడం ఇదేమీ మొదటి సారి కాదు. గతంలో కూడా చాలా సందర్భాల్లో ఇలా తన నృత్య ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు.

# చెన్నైలో కుండపోత వర్షం

- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- నదులను తలపించిన రహదారులు
- స్తంభించిన జనజీవనం

**నేషనల్ బ్యూరో :** చెన్నైలో కుండపోత వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. పలు కాలనీలు చెరువులా మారిపోయాయి. రహదారులు నదులను తలపించాయి. జనజీవనం స్తంభించిపోయింది. ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. వరద పోటెత్తడంతో పలుచోట్ల పార్కు చేసి ఉన్న వాహనాలు కొట్టుకుపోయాయి. నాలాలు పొంగిపొర్లుతున్నాయి. దాంతో చెన్నై నగరపాలక సంస్థ అధికారులు రంగంలోకి దిగారు. విపత్తును ఎదుర్కొనే చర్యలు చేపట్టారు. వరద కారణంగా ఎక్కడా ఎలాంటి ప్రమాదం జరగకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టారు.



## భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి ఫోన్ చోరీ

- నలుగురు అరెస్ట్
- ఓ దేశ రాయబారి ఫోన్ చోరీకి గురి కావడం హాట్ టాపిక్

**నేషనల్ బ్యూరో :** భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి థియెర్రీ మథవ్‌కు షాకింగ్ అనుభవం ఎదురైంది. కుటుంబంతో ఢిల్లీలోని ఓ ప్రముఖ ప్రాంతంలో షాపింగ్‌కు వెళ్లిన సమయంలో ఆయన ఫోన్ చోరీకి గురైంది. పాకెట్‌లో ఉన్న థియెర్రీ ఫోన్‌ను కొందరు వ్యక్తులు దొంగిలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 20న థియెర్రీ తన భార్యతో కలిసి ఢిల్లీలోని ఫేమస్ చాందినీ చౌక్ ఏరియాలో షాపింగ్‌కు వెళ్లారు. జైన్ మందిరం సమీపంలో ఆయన జేబులో ఉన్న మొబైల్ ఫోన్‌ను ఎవరో దొంగిలించారు. ఈ ఘటనపై థియెర్రీ ఆన్‌లైన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 21న ఫ్రాన్స్ రాయబార కార్యాలయం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా చాందినీ చౌక్ ప్రాంతంలో నిందితుల కోసం జల్లెడ పట్టారు. ఫోన్ దొంగతనం చేసింది నలుగురు వ్యక్తులని గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి ఫోన్‌ను రికవరీ చేశారు.

# 30వేలకు అమ్మేశాడు..

- 25 రోజుల పసిబిడ్డను విక్రయించిన తండ్రి
- అస్సాంలోని ధేమాజీ జిల్లాలో ఘటన



**నేషనల్ బ్యూరో :** పేదరికంతో బాధపడుతున్న ఒక వ్యక్తి 25 రోజుల పసిబిడ్డను రూ.30వేలకు అమ్మాడు. విషయం తెలుసుకున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) వెంటనే స్పందించింది. డాక్టర్ ఇంటి నుంచి ఆ శిశువును అధికారులు రక్షించారు. అస్సాంలోని ధేమాజీ జిల్లాలో ఈ ఘటన జరిగింది. ఈ నెల 4న దిబ్రూగఢ్‌లోని అస్సాం మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో ఓ మహిళ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పేదరికం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న తల్లిదండ్రులైన ధిమాన్ బోరా, సబితా బోరా ఆడ పిల్లను భారంగా భావించారు. శిశువును ఆ హాస్పిటల్‌లో వదిలి అక్కడి నుంచి పారిపోయారు. కాగా, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం తెలిసింది. దీంతో సిలాపత్తర్‌లోని డాక్టర్ చంద్రజిత్ డోలే ఇంట్లో ఉన్న ఆ శిశువును రక్షించి స్వాధీనం చేసుకున్నారు. శిశువు విక్రయంలో బుబుల్ బోరా, దిలీప్ సైకియా కీలక పాత్ర ఉందని అధికారులు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సూర్యాపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచాలని వినతి



సూర్యాపేట, (ప్రజాస్ఫూర్తి) : సూర్యాపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అబివృద్ధి పరచాలని కోరుతూ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ముఖ్యమంతి రేవంత్ రెడ్డి ని కలిసి అందజేశారు.

# పంచశీల పాఠశాలలో ఘనంగా దీపావళీ వేడుకలు




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : దీపావళీ పండుగ సందర్భంగా మూసా పేట లోని పంచశీల స్కూల్ లో బుధవారము దీపావళి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మట్టి ప్రమిదలు తాయారు చేస్కొని వచ్చి ,బొమ్మల కొలువు ప్రదర్శించటం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ మట్టి ప్రమిదలలో దీపం వెలిగించే విశిష్టతను, దీపావళి పండుగ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ వృద్ధ అనాధాశ్రమంలో రేగళ్ల కరణ్ తేజ రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి , కాప్రా : కాప్రా డివిజన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి చిన్న కుమారుడు రేగళ్ల కరణ్ తేజ రెడ్డి పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆదర్శ వృద్ధ అనాధాశ్రమంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు అనంతరం రేగళ్ల సతీష్ రెడ్డి మాట్లాడుతూ చిన్నపిల్లలకు చిన్నప్పటినుండి ప్రతి ఒక్క తల్లిదండ్రులు సేవా కార్యక్రమాలు నేర్పించాల్సింది గా కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బాల్ రెడ్డి, మన స్నేహం కావేరి తదితరులు పాల్గొన్నారు

# పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను సత్కరించిన రాచకొండ కమిషనర్



ప్రజాస్ఫూర్తి , హైదరాబాద్ : రాచకొండ పోలీస్ కమిషనరేట్ లో పనిచేస్తూ బుధవారం పదవీ విరమణ పొందిన స్పెషల్ బ్రాంచ్ సబ్ ఇన్స్పెక్టర్ యం.నవీన్, కంట్రోల్ రూం సబ్ ఇనస్పెక్టర్ రంగారెడ్డి , ఇబ్రహీంపట్నం సబ్ ఇనస్పెక్టర్ కృష్ణారెడ్డిలను సుధీర్ బాబు తన కార్యాలయంలో సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఇన్ని రోజులు పోలీసుశాఖలో సమర్ధవంతంగా క్రమశిక్షణతో పనిచేసి సేవలు అందించినందుకు అభినందించారు. పదవీ విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని, ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ చూపాలని, పెన్షన్ మరియు ఇతర ఆర్థిక అంశాల పట్ల క్రమశిక్షణ పాటించాలని సూచించారు. వారికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమములో పి.ఇందిర, డీసీపీ అడ్మిన్, అరవింద్ బాబు, డిసిపి క్రైమ్స్, శ్రీధర్ రెడ్డి, ఏసిపి, స్పెషల్ బ్రాంచ్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రా రెడ్డి, కృష్ణారెడ్డి మరియు ఇతర కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి కరెంటు చార్జీల పెంపు విరమింప చేసాం

**: రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్**



రాజాపేట, ప్రజాస్ఫూర్తి : రాష్ట్రంలోని పేద సామాన్య ప్రజలపై కరెంటు చార్జీల పేరుతో ఆర్థిక భారం మోపే కుట్రలు పండిన కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీసి మెడలు వంచి ఆలోచన బిఆర్ఎస్ పార్టీకే దక్కిందని రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ అన్నారు. బుధవారం రాజపేట మండల కేంద్రంలోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం కూడలి వద్ద బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ జరిపిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల కోసం ప్రజల గురించి ఆలోచిస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలపై ఆర్థిక భారం మోపే విధానాలను తీసుకొస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కుతంత్రాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ఉంటామని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సారధ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్రెడ్డి నాయకత్వంలో ప్రజల కోసం నిరంతరం పాటుపడుతూనే ఉంటామని తిరుమలేష్ స్పష్టం చేశారు. కరెంటుచార్జీల పెంపుతో ప్రజలపై అదనంగా పడనుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకొని రేవంత్ రెడ్డి వచ్చే నాలుగేళ్లలో చేపట్టే ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఎప్పటికప్పుడు ఎండగట్టే విధంగా ఓటరు దేవుళ్ళు మరింత బలాన్ని ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు.....

అధికారులను అవమానిస్తున్న కాంగ్రెస్ నాయకులు : అభివృద్ధి పనులు అధికారులు లేకుండానే కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభిస్తూ ప్రోటోకాల్ పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారులను అవమానిస్తున్నారని బిఆర్ఎస్ రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ ఆరోపించారు. బుధవారం ఆయన రాజపేట విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాజపేట మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న తాము ఏమి చేసినా చెల్లుతుందనే అహంకార ధోరణి కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో కనబడుతోందన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సమాధానం చెప్పాలని లేనిపక్షంలో ఆయన ప్రోద్బలంతోనే ప్రోటోకాల్ ఉల్లంఘిస్తున్నట్లు స్పష్టమవుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ప్రజలు గమనిస్తున్నారని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెపుతారని తిరుమలేశ జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల మహిళా శాఖ అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మాజీ జెడ్పిటిసి చామకూర గోపాల్, యువజన విభాగం అధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్, రాజపేట పట్టణ శాఖ అధ్యక్షులు బెడిద వీరేశం, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు ఎర్రగోకుల జస్వంత్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి భోగ హరినాథ్, రామిండ్ల నరేందర్, మొలుగు సోమలింగం, మండల పార్టీ సెక్రటరీ జనరల్ సంధిల భాస్కర్ గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లు గుంటి కృష్ణ, గుర్రం నర్సింలు, మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య గౌడ్, మాడోత్ రాములు, దేవ్ ల నాయక్, మడోత్ లక్ష్మణ్, కటకం వెంకటేష్, అంకతి సుదర్శన్, నాయకులు, కార్యకర్తలు పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# సంస్కృతి పాఠశాలలో ఘనంగా దీపావళీ వేడుకలు







జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : దీపావళీ పర్వదినం సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో గల సంస్కృతి పాఠశాలలో దీపావళీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల పూవ్వులతో ముగ్గులు వేశారు. దీపాలు వెలిగించి ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ దీపావళి పండుగ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకే దీపావళి అని అన్నారు. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ టపాసులను కాల్చుకోవాలని ఏలాంటి ప్రమాదాలు జరుగకుండా పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీస్ విధులు ఉండాలి

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీస్ విధులు ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో 5ఎస్ అమలు చేసిన తీరు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది యొక్క డ్యూటీల గురించి అడిగి తెలుసుకుని,రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్ని విభాగాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని, పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు.అధికారులు, సిబ్బంది విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా తరచు గ్రామాలు, వార్డులు పర్యటిస్తూ ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నతాధికారులు తెలిసేలా ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ డ్రంక్ అండ్ డ్రైవ్ లు ఏర్పాటు చేయాలని, గంజాయి కిట్ల సహాయంతో అనుమానిత వ్యక్తులకు టెస్ట్ లు నిర్వహించాలని, జిల్లాలో గంజాయి నివారణకు పకడ్బందీగా చర్యలు చెపడుతున్నామని, గంజాయి కి సంబంధించిన సమాచారం సబంధిత పోలీస్ వారికి లేదా, డయల్ 100 కి సమాచారం అందించాలన్నారు. అధికారులకు, సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ ఉన్నారు.

# కాలనీని పచ్చని వనంలా సుందరంగా మార్చుకోవాలి

**కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్**



శేరిలింగం పల్లి, (ప్రజాస్ఫూర్తి) : రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెట్టి కాలనీని పచ్చని వనంలా సుందరంగా మార్చుకోవాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని సాయి నగర్ వెస్ట్ కాలనీ లో రూ.17 లక్షల నిధులతో నిర్మాణ పనులు పూర్తయిన నూతన సీసీ రోడ్లను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి వేయాలనిన్నారు. మంచిగా క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. సీసీ రోడ్డు నిర్మించిన కార్పొరేటర్ కి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, రఘు, ప్రవీణ్, రామరాజు, సంతోష్ బిరాదర్, ఉమేష్, సంతోష్, రాజు గౌడ్, కార్తీక్, వినీత్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లండన్ లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నివాసాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



యాదగిరిగుట్ట అక్టోబర్ 30 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బుధవారం లండన్ పర్యటన లో భాగంగా భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నివసించిన గృహాన్ని సందర్శించారు. భారతరత్న అంబేద్కర్ తన బారిష్టర్ చదువుకొని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ యూనివర్సిటీలో అభ్యసించిన సమయంలో తాను నివసించిన గృహంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు, ఆ మహనీయుడి జీవిత చిత్రాలను చూసానన్నారు .అప్పట్లో అతను రాసిన అక్షరాలనీ చూసానని, అక్కడి లైబ్రరీలో అంబేద్కర్ గురించి మరిన్ని విషయాలను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తన సందర్శనలో తెలుసుకున్నానన్నారు.

# వైద్యం కోసం ఎల్ఓసి అందజేత

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన చిగురు దేవేందర్ కుమారుడు చిగురు నీరజ్ నిమ్స్ ఆసుపత్రిలో వైద్య ఖర్చుల కోసం ఎల్ఓసికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ద్వారా 75వేల రూపాయల ఎల్ఓసి చెక్ మంజూరు అయ్యింది. ఈ మేరకు నాయకులు ఎల్ఓసి చెక్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. వైద్య ఖర్చుల కోసం ఎల్ఓసి మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డికి చిగురు దేవేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

# డా. హోమి జె బాబా ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి

*** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి , కాప్రా : డా. హోమి జె బాబా ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. డా. హోమి జె బాబా 115 వ జయంతి సందర్భంగా ఏ ఎస్ రావు నగర్ లోని డా. హోమి జె బాబా ఫంక్షన్ హాల్ వద్ద ఆయన విగ్రహాన్ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శిరీష శేఖర్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ పొందిన అధికారులకు ఘన సన్మానం

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి జోనల్ కార్యాలయంలో పదవి విరమణ పొందుతున్న అధికారులను ఘనంగా సన్మానించారు. బుధవారం మూసాపేట సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పాల్గొని పదవి విరమణ పొందుతున్న మూసాపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అడప రమేష్ ని, మూసాపేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసిపి డి మల్లేశ్వర్ ని, డిప్యూటీ డైరెక్టర్ వెటర్నరీ ఎన్. సుకు నందన్ రెడ్డి లను ఆయన శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ



డిప్యూటీ కమిషనర్ రమేష్ తను కార్పొరేటర్ ఉన్నప్పటి నుంచి దాదాపు 15 సంవత్సరాల సంబంధాలు ఉన్నాయన్నారు. జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ లో సెక్రటరీ సెక్షన్ లో పని చేస్తూ సెక్రటరీగా , వివిధ సర్కిలలో డిప్యూటీ కమిషనర్ గా పని చేసి చివరగా మూసాపేట సర్కిల్లో డిప్యూటీ కమిషనర్ గా పనిచేసి రిటైర్ అవ్వడం మాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. జిహెచ్ఎంసి గా ఏర్పడి నప్పటినుండి ఉమ్మడి సర్కిల్ కానీ మూసాపేట సర్కిల్ గా ఏర్పడినప్పటి నుండి గాని పనిచేసిన డిప్యూటీ కమిషనర్ ల కంటే రమేష్ ఎక్కువగా పని చేసి ఇటు ప్రజలకు అటు చిన్న స్థాయి అధికారుల నుండి పై స్థాయి అధికారులతో ఇటు ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైద్యం కోసం ఎల్ఓసి అందజేత

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన చిగురు దేవేందర్ కుమారుడు చిగురు నీరజ్ నిమ్స్ ఆసుపత్రిలో వైద్య ఖర్చుల కోసం ఎల్ఓసికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ద్వారా 75వేల రూపాయల ఎల్ఓసి చెక్ మంజూరు అయ్యింది. ఈ మేరకు నాయకులు ఎల్ఓసి చెక్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. వైద్య ఖర్చుల కోసం ఎల్ఓసి మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డికి చిగురు దేవేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఆవుల డీసీఎం పట్టివేత



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అక్రమంగా ఆవులను రవాణా చేస్తున్న డీసీఎంను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణం పన్నాలగూడ కాలనీకి చెందిన ఎండి అన్వర్ విజయవాడ హనుమాన్ జంక్షన్ నుంచి బహదూర్ పురకు డీసీఎం(టీఎస్ 11 యుడీ 4667)లో 61ఆవులను అక్రమంగా తరలిస్తున్నాడు. ఈ క్రమంలో చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా ఉదయం 7గంటలకు వాహనాల తనిఖీలో పట్టున్నారు. పట్టుబడిన ఆవులను జియాగూడకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## దీపావళి పర్వదిన శుభాకాంక్షలు

- **ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి: దీపావళి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడిన, నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజలందరికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి ఇళ్లలో చీకట్లు తొలగిపోయి వెలుగులు ప్రసరించాలని, శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. టపాకాయలు కాల్చేటప్పుడు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని ప్రజలను కోరారు.

## పదవీ విరమణ పొందుతున్న అధికారుల సేవలు అభినందనీయం

**కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : విధి నిర్వహణలో సమర్థవంతంగా పని చేసి పదవీ విరమణ పొందుతున్న అధికారుల సేవలు అభినందనీయమని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. జిహెచ్ఎంసి మూసాపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రమేష్ , టౌన్ ప్లానింగ్ ఏసీపీ మల్లేశ్వర్ రావు లు ఈ నెల 31న పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు , మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు , బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు సిహెచ్. ప్రభాకర్ గౌడ్ లతో కలిసి వారిని శాలువాతో సత్కరించి వారి సేవలను కొనియాడుతూ హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగ జీవితం నుంచి విరమణ పొందినప్పటికీ సామాజిక సేవలను కొనసాగించాలన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కుటుంబానికి అధిక సమయం కేటాయించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భాస్కర్ రావు, అంజి గౌడ్, సుశీల్ కుమార్, వెంకటేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## అండర్ 14 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

తిరుమలగిరి,ప్రజాస్ఫూర్తి : తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామ హై స్కూల్ విద్యార్థి బి సుమన్ తుంగతుర్తి హై స్కూల్లో నిర్వహించినటువంటి నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 కబడ్డీ పోటీలలో జిల్లా స్థాయికి ఎంపిక కావడం జరిగింది. విద్యార్థి తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. ఈ ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే అశోక్ రెడ్డి,పిడి కే మహేష్, ఉపాధ్యాయులు, తో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు దీపావళి పండుగ

- **ట్రినిటీలో ముందస్తు దీపావళి వేడుకలు**
- **ఉజ్జిని మంజుల**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పండుగను ఘనంగా నిర్వహించుకుంటామని స్కూల్ డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటీ స్కూల్ లో ముందస్తుగా దీపావళి వేడుకలను బుధవారం ఘనంగా చేశారు. విద్యార్థులు వివిధ రకాల పూవ్వులతో ముగ్గులు వేశారు. దీపాలు వెలిగించారు. ఆటపాటలతో సందడి చేశారు. అలాగే ఉపాధ్యాయులు చిన్నపిల్లలతో గ్రీన్ క్రాకర్స్, చిచ్చుబుడ్లు కాల్చి సందడి చేశారు. ఈ సందర్భంగా ఉజ్జిని మంజుల మాట్లాడుతూ విద్యార్థులకు దీపావళి పండుగ గురించి వివరించారు. అదేవిధంగా పర్యావరణానికి హాని కలిగించకుండా దీపావళి పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ స్కూల్ చైర్మన్ కెవిబి కృష్ణారావు, కిడ్స్ జోన్ ఉపాధ్యాయులు లోవ కుమారి, సుమలత, స్వరూప, భార్గవి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మీడియా అకాడమీ చైర్మన్ ను కలిసిన సమాచార శాఖ కమిషనర్



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ రాష్ట్ర సమాచార , పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన ఎస్.హరీష్ బుధవారం మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి ని బి.ఆర్.కె భవన్ లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన నూతన కమిషనర్ కు చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమ చర్యలపై వారు చర్చించారు.

## దీపావళీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

* **బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు**



శేరిలింగంపల్లి, ( ప్రజాస్ఫూర్తి) : దీపావళీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు అన్నారు. దీపావళి పర్వదినం సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు మాట్లాడుతూ లక్ష్మీనారాయణ అనుగ్రహంతో శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలందరికీ శుభం చేకూరాలన్నారు. చీకటి మీద వెలుగు, చెడు మీద మంచి, దుష్టశక్తుల మీద దైవ శక్తి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని పేర్కొన్నారు. దీపావళి పండుగను సుఖ సంతోషాలతో కుటుంబ సభ్యుల మధ్య ఆనందదాయకంగా జరుపుకోవాలన్నారు. దీపావళి సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని ప్రజలందరి జీవితాలు శోభాయమానంగా వెలుగొందాలన్నారు. ప్రతి ఇంటి ఆనంద కాంతులు విరజిల్లాలని భాస్కరరావు ఆకాంక్షించారు.


## నిబంధనలకు అనుగుణంగా ధాన్యం దించుకొని రైస్ మిల్లర్లు సహకరించాలి

- **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మిల్లులో ధాన్యం దించుకొని రైస్ మిల్లర్లు సహకరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లాలోని రా, బాయిల్డ్ రైస్ మిల్లుల బాధ్యులతో బుధవారం కలెక్టర్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్లకు రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు వివరించారు. అనంతరం రైస్ మిల్లర్ల అంశాలపై చర్చించారు. తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, బ్యాంక్ గ్యారంటీ, టెస్ట్ మిల్లింగ్, బియ్యం అందించే గడువు పెంచాలని, గన్ని బ్యాగుల సమస్య పరిష్కరించాలని రైస్ మిల్లర్లు కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. రైతుల సౌకర్యార్థం జిల్లాలో ఇప్పటిదాకా 152 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. ఇంకా అవసరం మేరకు మరిన్ని కేంద్రాలు ప్రారంభిస్తామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు రైస్ మిల్లర్లు సహకరించి, ధాన్యం తీసుకోవాలని సూచించారు. మిల్లర్లు తమ దృష్టికి తీసుకువచ్చిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. రైతుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని రైస్ మిల్లర్లు వెంటనే ధాన్యం దిగుమతి చేసుకొని సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వసంతలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ రజిత, డిప్యూటీ తహసీల్దార్లు (సిఎస్) రా, బాయిల్డ్ రైస్ మిల్లుల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు

## అయ్యప్ప పూజ విధానము" పుస్తకం ఆవిష్కరించిన స్వాములు



ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ : సీనియర్ జర్నలిస్ట్ కోడెం గోపి గురుస్వామి రచన చేసిన అయ్యప్ప పూజ విధానము పుస్తకాన్ని స్థానిక శ్రీనివాసనగర్ కాలని అయ్యప్ప దేవాలయం చైర్మన్ కొలను చంద్రశేఖర్ గురుస్వామి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప పూజావిధానము తో పాటు మాలదారుల నియమావళిని, దీక్షసమయం లో చేసే ఈ కఠోర నియమాల ఆచరణ వలన స్వాములకు ఆరోగ్య రీత్యా కలిగే ఉపయోగాలాగురించి ఈ పుస్తకం లో చక్కగా వివరించారని అని అన్నారు. స్వాములకు ఉచితంగా పంచేందుకు ముద్రనకు సహకరించిన వారికి రచయిత కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమం లో ఈనాటి అన్నదాత అబ్బురి సాయి, ఆలయకమిటి సభ్యులు, సన్నిదాన, ఇతర స్వాములు పాల్గొన్నారు.

## చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకే దీపావళి

* **హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు**



శేరిలింగం పల్లి, (ప్రజాస్ఫూర్తి) : . చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకే దీపావళి అని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా బుధవారం హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు హైదర్ నగర్ డివిజన్ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, మహిళ సోదరీమణులకు, బంధు మిత్రులకు, ఆత్మీయులకు, శ్రేయోభిలాషులకు, పాత్రికేయ మిత్రులకు, కాలనీ అసోసియేషన్ సభ్యులకు, కాలనీ వాసులకు, అభిమానులకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ చీకట్లను పారద్రోలి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు వెల్లివిరియాలని తెలిపారు. సరదాలు, సంబరాలు, దీపాల వెలుగులు, బాణాసంచాల జిలుగులతో కుటుంబాలు సంతోషాలతో వెల్లివిరియాలని ఆకాంక్షించారు. కోటి కాంతుల చిరునవ్వులతో జీవితాంతం సుఖ సంతోషాలతో ఉండాలని, సురక్షితంగా బాణసంచాను కాల్చి, పర్యావరణ హితంగా పండుగను జరుపుకోవాలని పండుగ ను చక్కటి వాతావరణం లో కుటుంబ సభ్యుల మధ్య ఆనందాయకంగా, సంతోషకరంగా జరుపుకోవాలని కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు తెలియజేసారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా చూడాలి

* **ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేత గోపాల్ రెడ్డి**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలని నిజాంపేట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్ రెడ్డి బుధవారం ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యక్రమాలను సంక్షేమ పథకాలను లబ్ధిదారులైన నిరుపేద ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ.. మరో జీవితానికి ప్రారంభం

**- కె మనోహర్**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి : ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ.. నూతన జీవితానికి ప్రారంభమని కార్యనిర్వాహణాధికారి కె మనోహర్ అన్నారు. చౌటుప్పల్ ఇరిగేషన్ శాఖ సబ్ డివిజన్ 12లో అటెండర్ గా విధులు నిర్వహిస్తున్న డి సుశీల ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని తోటి సిబ్బంది లక్కారంలోని వీవీఆర్ రెస్టారెంట్ లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్యనిర్వాహణాధికారి కె మనోహర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు వృత్తి రీత్యా కుటుంబ సభ్యుల కంటే, సహచర ఉద్యోగస్తులతోనే ఎక్కువ కాలం గడుపుతారన్నారు. ఉద్యోగిగా సహచర ఉద్యోగ విరమణ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈలు ఇందిరా ఉషశ్రీ, రాజవర్ధన్ రెడ్డి, ఏఈ రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, జూనియర్ అసిస్టెంట్ వినీత్, రహీమ్, రమ, కార్యాలయ సిబ్బంది ఎండి లతీఫ్, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అండర్ 17 జిల్లా స్థాయి ఖో ఖో పోటీలకు తొండ విద్యార్థి ఎంపిక



తిరుమలగిరి,ప్రజాస్ఫూర్తి : తిరుమలగిరి మండలం తొండ గ్రామ హై స్కూల్ విద్యార్థి సంకటి అరుణ్ కుమార్ తుంగతుర్తి హై స్కూల్లో నిర్వహించినటువంటి నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 ఖో ఖో పోటీలలో జిల్లా స్థాయికి ఎంపిక కావడం జరిగింది. సంకటి అరుణ్ కుమార్ తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. ఈ ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు , మండల విద్యాధికారి ఐ శాంతయ్య, పి ఈ టి పొరెళ్ల వెంకన్న, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వీరన్న,వెంకటి, సైదులు, రఘుపతి, రాజు,నాగయ్య తో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# టీవిఆర్ మోడల్ హై స్కూల్ లో ఘనంగా దీపావళీ వేడుకలు




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : దీపావళీ పర్వదినం సందర్భంగా బుధవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్ నగర్ డివిజన్ అపూరూప కాలనీలో గల టీవిఆర్ మోడల్ హై స్కూల్, ఎస్ఆర్ నాయక్ నగర్లో ని సత్యవాణి విద్యానికేతన్ లలో టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో దీపావళి పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరక చతుర్దశి ప్రాముఖ్యత శ్రీకృష్ణుడు సత్యభామ , నరకాసురుడి వేషధారణలో" నరకాసుర వధ" పౌరాణిక భాషా శైలిలో నృత్య నాటిక ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలను తెలిపే విధంగా చిన్నారులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల యాజమాన్యం అభినందించారు. అనంతరం టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టీ. కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సుర రవిచంద్ర రెడ్డి లు విద్యార్థిని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# స్వచ్ఛ కార్మికులకు సిపిఐ, ఏఐటీయూసీ అండగా ఉంటుంది


* **సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : పాల్వంచ మున్సిపల్ శాఖలో పని చేస్తున్న స్వచ్ఛ కార్మికులకు సిపిఐ, ఏఐటీయూసీ అండగా ఉంటుందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో బుధవారం జరిగిన పాల్వంచ మున్సిపల్ స్వచ్ఛ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేతనాలకు సంబందించిన సమస్యను త్వరలో పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని తెలిపారు.. కొత్తగూడెం, ఇల్లందు మున్సిపాలిటీల్లో ఆయా మున్సిపల్ శాఖల నుంచి వేతనాలు చెల్లిస్తుండగా పాల్వంచ మున్సిపాలిటీలో అందుకు భిన్నంగా కుటుంబ యజమానుల నుంచి డబ్బులు వసులు చేసుకోవాలనే నిబంధన వల్ల కార్మికులు నష్ట పోతున్నారన్నారు. కుటుంబ యజమానుల నుంచి కార్మికులు చీదరింపులకు గురి అవుతున్నారన్నారు. మున్సిపల్ శాఖా ద్వారా వేతనాలు చెల్లించేందుకు స్థానిక ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, ఇప్పటికే జిల్లా కలెక్టర్, మున్సిపల్ శాఖా మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారని, త్వరలో సమస్యకు పరిస్కారం లభిస్తుందన్నారు. కార్మికులకు అన్యాయం జరగనివ్వబోమని వారికి అండగా నిలబడి న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, నాయకులు పాటి మోహన్, బాలాజీ, నాగరాజు, పాషా, హుస్సేన్, కార్తీక్, లాలూ, సంధ్య, రాము, రాణి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి

# బండి సంజయ్ కి త్రిబుల్ ఆర్ బాధితుల వినతి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మార్చాలని కోరుతూ చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ లకు చెందిన భూనిర్వాసిత రైతులు, ప్లాట్ ఓనర్లు కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్ కి బుధవారం హైదరాబాద్లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు నార్త్ సైడ్ త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ను, ఓ ఆర్ ఆర్ నుంచి 28కి.మీ.లకు పరిమితం చేశారని, దీంతో చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ మున్సిపాలిటీలు రెండు, మూడు భాగాలుగా విడిపోతున్నాయని పేర్కొన్నారు. 40కి.మీ.లకు అలైన్మెంట్ మార్చితే మున్సిపాలిటీ విడిపోకుండా, గ్రామీణ ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. మున్సిపాలిటీ లోని భూముల బహిరంగ మార్కెట్ విలువ సుమారు రూ.2నుంచి 5కోట్లు, హెచ్ఎండిఏ ప్లాట్లు గజానికి సుమారుగా రూ.20వేలు ఉండగా, ప్రభుత్వం మాత్రం నష్టపరిహారము ఎకరాకి రూ.20 నుంచి 30లక్షలు, హెచ్ఎండీఏ ప్లాట్లలో గజానికి రూ.5నుంచి 6వేలు వరకే ఇస్తామంటున్నారు, దీంతో పెద్ద ఎత్తున నష్టపోతున్నామని తెలిపారు. గతంలో ప్రభుత్వ ప్రాజెక్టులు, నేషనల్ హైవేల కోసం, విద్యుత్ స్తంభాల కోసం, నీటి కాలువల కోసం కోల్పోయామని తాము భూములు కోల్పోయామని, నా కాస్త భూమి ఇప్పుడు ట్రిబుర్ వలన కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు బిచ్చగాళ్ళు అయ్యే పరిస్థితి వచ్చిందని వాపోయారు. సౌత్ సైడు త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ఓఆర్ఆర్ నుంచి 40కిమీ.లకు చేస్తున్నట్లుగా, నార్త్ సైడ్ అలైన్మెంట్ ను కూడా శాస్త్రీయబద్ధంగా 40కి.మీ.లకు మార్చాలని, బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం ఇస్తూ, జీవనోపాధి ఇప్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి దీనిపైన విచారణ జరిపి రైతులకు తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో మునుగోడు నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ గంగిడి మనోహర్ రెడ్డి, భూ నిర్వాసితులు సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డిగారు, చౌటుప్పల్ మాజీ జెడ్పిటిసి పెద్దేటి బుచ్చిరెడ్డి, బిజెపి మండల నాయకులు గుజ్జుల సురేందర్ రెడ్డి, మారుపాక లింగంగౌడ్, కౌన్సిలర్ గోపగోని లక్ష్మణ్, చింతల సుధాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జాల శ్రీశైలం యాదవ్, జాల జంగయ్య యాదవ్, జాల వెంకటేష్ యాదవ్, జాల నరసింహ, గుండె బోయిన గాలయ్య, వేణు యాదవ్, భోగయ్య, ప్రకాష్ రెడ్డి, జోసెఫ్, కార్తీక్, కనకరాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ పాఠశాలలో విన్నూత్నంగా ముందస్తు దీపావళి వేడుకలు..

* **విద్యార్థులతో సామాజిక మాధ్యమాలపై యుద్ధం ...**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ నెహ్రూనగర్ నారాయణ పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను విన్నూత్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ పాఠశాల పాల్వంచ శాఖ ప్రధానోపాధ్యాయులు పూరేటి నరసింహారావు విన్నూత్నంగా రిమోట్ కంట్రోల్ ద్వారా విద్యార్థుల కరతాళ ధ్వనుల మధ్య సామాజిక మాధ్యమాల తలలతో కూడిన నరకాసురుని వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ దీపావళి పండుగ ఆశ్వయుజ బహుళ అమావాస్య రోజున జరుపుకుంటామని, దీపావళి అంటే దీపాల వరుస అని, హిందూ మతంలో అత్యంత ముఖ్యమైన పండుగల్లో ఒకటి అని , చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా బాణసంచా కాల్చి దీపావళి వేడుకలను జరుపుకుంటారని తెలిపారు. విద్యార్థులకు సామాజిక మాధ్యమాల దుష్పరిణామాలను వివరిస్తూ ఒకప్పుడు తీరిక దొరికితే ఇంట్లో పెద్దలు పిల్లలు కూర్చుని మంచి చెడ్డ మాట్లాడుకునే వాళ్ళు. కుటుంబ భవిష్యత్ కోసం ఏం చేస్తే బాగుంటుందో చర్చించుకునే వారు అని. ఇప్పుడు అందరు స్మార్ట్ ఫోన్లు పట్టుకునే వాటిల్లోనే మునిగిపోతున్నారు. భార్య, భర్త , పిల్లల మధ్య మాటల్లేవు, మాట్లాడుకోవాడాలు లేవు. కాబట్టి తమ నారాయణ పాఠశాల దీపావళి వేడుకలలో నరకాసురుని తలలకు సామజిక మాధ్యమాలను పెట్టి అభినవ నరకాసుర వద కార్యక్రమం విన్నూత్నంగా నిర్వహించారు.

* **విద్యార్థిని, విద్యార్థులతో సామాజిక మాధ్యమాలపై యుద్ధం.**

నారాయణ విద్యార్థులు సిద్ధం అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ వేడుకలలో అన్ని తరగతుల విద్యార్థుల ఉల్లాసంగా, ఉత్సాహంగా భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ దుస్తుల్లో ఎంతో ఆనందంగా ధనలక్ష్మి దేవికి పూజలు నిర్వహించారు. చిన్నారులు ఆట పాటలతో నృత్యాలు చేస్తూ అందరిని అలరించారు.ఈ వేడుకలలో సామజిక మాధ్యమాలపై అవగాహనా కల్పిస్తూ చేసిన ఏర్పాట్లు, తల్లితండ్రులలో ఆసక్తిని, విద్యార్థులలో ఆలోచనను రేకెతించాయి. ముఖ్యంగా ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థుల నృత్యాలు చూపరులను మంత్రముగ్ధులను చేసింది. విద్యార్థిని, విద్యార్థులు రాముడు, కృష్ణుడు, సత్యభామల లీలలను ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలు చూపరుల మదిలో ముద్రవేశాయి.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పూరేటి నరసింహారావు, ఈ ఛాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ రుచిత శ్రీ, ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ పద్మ, 10వ తరగతి ఇంచార్జి మల్లేష్, ఉపాధ్యాయులు కె. అనూష, దీప్తి, సుజిత్, సురేష్, మంగ్యా, రమేష్ బాబు, కళ్యాణి, శైలజ, రహీమ, శ్రీలత, నాగుర్ బీ, జాహ్నవి, ఆఫ్రీన్, నాగరాణి, అలియా, స్పందన, అనూష, నిఖిల, కావ్య, సరిత, స్రవంతి, స్వాతి, గోవర్ధన్, వెంకట్, పీఈటి వినయ్ పాల్గొన్నారు.

# ప్రైవేటు ఏజెన్సీ లను రద్దు చేయాలి

* **సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఉన్న మెడికల్ కళాశాల అనుభందంగా కేంద్ర జిజిహెచ్చేస్, ఎంసీహెచ్ లలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల భర్తీ లలో దరఖాస్తు చేసుకున్న ఒక్కొక్కరి వద్ద నుండి రెండు లక్షల నుండి, మూడు లక్షల రూపాయలు వరకు నిరుద్యోగుల నుండి ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ఆయన అన్నారు. గత సంవత్సరం కూడా మెడికల్ కళాశాల లో జరిగిన అవినీతి ఆరోపణలు ఎదుర్కొనీ సస్పెండ్ చేసిన విషయం అందరూ మరవక ముందే మళ్ళీ నిన్న వైద్య కళాశాల సంబంధిచిన అధికారులు అవినీతి ప్రత్యక్షంగా పట్టుబడటం కనిపిస్తుందని అన్నారు. ఇంత అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్య వ్యవస్థ పై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రైవేట్ ఏజెన్సీ ల ద్వారా ఔట్ సోర్సింగ్ పోస్టులు భర్తీ చేస్తున్నారని, అటువంటి వ్యక్తుల వల్ల అక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. ఏజెన్సీ లను రద్దు చేసి, కలెక్టర్ ఆద్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి ఆ పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. జిల్లా స్థాయి లో జరిగిన ఈ అవినీతి కార్యక్రమాలకు కలెక్టర్ కూడా బాధ్యత వహించి, క్షేత్ర స్థాయి లో పరిశీలించి, విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

# పేద ప్రజల పక్షాన పోరాడే ఏకైక పార్టీ బిఆర్ఎస్

* **బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : పేద ప్రజల పక్షాన పోరాడే ఏకైక పార్టీ బిఆర్ఎస్ అని పలువురు బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించినందుకుగాను బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ల ఆదేశాల మేరకు గండి మైసమ్మలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విజయోత్సవ సంబరాలలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి మిఠాయిలను తినిపించుకుంటూ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాలు పేద ప్రజలను మరింత పేదరికంలోకి నెట్టకుండా ఉండాలే కానీ ప్రజలు ఎటు పోతే మాకేంటనేలా ఉండకూడదన్నారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనల్లో భాగంగా దాదాపు 18,500 కోట్ల భారాన్ని ప్రజలపై మోపమంటూ విద్యుత్ నియంత్రణ మండలికి సిఫారసు చేయడం హేయమైన చర్య అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఈ సిఫారసులను ప్రజాభిప్రాయ సేకరణలో తీవ్రంగా వ్యతిరేకించిందని, సామాన్యుడిపై మోయలేని భారాన్ని మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వ సిఫారసులను బిజెపి పార్టీ ఏ రోజు కూడా వ్యతిరేకించలేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, పాక్స్ చైర్మన్లు, డైరెక్టర్లు, వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకురాలు, బిఆర్ఎస్ అనుబంధ సంఘాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# దీపావళి విశిష్టత

దీపావళి: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ. ఇంట్లోని ప్రతికూల శక్తులను తొలగించి నూతన వెలుగులు తీసుకొచ్చే గొప్ప పండుగ. హిందువులతో పాటు జైనులు, బౌద్ధులు, సిక్కులు, ఇతర మతస్తులు ఆరోగ్యం, సంతోషాన్ని కోరుకుంటూ సెలబ్రేట్ చేసుకునే పర్వదినమే దీపావళి. ఈ ఏడాది నవంబరు 12, 13 (ఆది, సోమవారాలు) జరుపుకోనున్నారు. దీపావళి విశిష్టతల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

## ధన్వంతరి జయంతి

ధన్వంతరి జయంతి ఆరోగ్యానికి, ఔషధాలకు అధిపతి అయిన ధన్వంతరి, క్షీరసాగర మథనంలో ఉద్భవించాడు. ఆయుర్వేద వైద్యులు చికిత్స ప్రారంభించేటప్పుడు ఆయనను స్మరించుకుంటారు. ఈ రోజు ధన్వంతరిని పూజిస్తే ఆరోగ్యం, మహాభాగ్యం కలుగుతుందని నమ్ముతారు.



## దీపాలను వెలిగించి

రామాయణంలో దీపావళి ప్రస్తావన ఉంది. పురాణాల ప్రకారం, నరకాసురుడు శ్రీహరి చేతిలో చావు పొందుతాడు, దీంతో అందరూ ఆనందంతో పండుగ చేసుకుంటారు. చతుర్దశి నాడు నరకుడు చనిపోతాడు, తరువాత రోజు దీపాలు వెలిగించి సంబరాలు చేసుకుంటారు. దీపావళి అంటే దీపాల వరస అని అర్థం. కొన్ని ప్రాంతాల్లో దీపావళిని ఐదు రోజుల పండుగగా జరుపుకుంటారు, ఆశ్వయుజ బహుళ త్రయోదశి నుంచీ మొదలు, కార్తీక శుద్ధ విదియ 'భగినీహస్త భోజనం'తో ముగుస్తుంది.

## ధన త్రయోదశి

ధన త్రయోదశి రోజున ఇంటిని శుభ్రం చేసి, కొత్తగా కొనుగోలు చేసిన వెండి, బంగారు ఆభరణాలు పూజిస్తారు. ఈ రోజున పూజించిన వారికి ధనలక్ష్మి అష్టైశ్వర్యాలను ప్రసాదిస్తుందని నమ్ముతారు. పురాణాలు ధన త్రయోదశి రోజున లక్ష్మీ దేవి ఉద్భవించినట్లు చెప్తున్నాయి. ఈ రోజు ఏ వస్తువు కొనుగోలు చేసి శుభం జరుగుతుందని చాలా మంది నమ్ముతారు.

## ఆచారాలు

అమావాస్య రోజు ఇంటిని శుభ్రం చేసి, పిండి వంటలు తయారు చేస్తారు. సంధ్యా సమయంలో గోగు కర్రలకు కాగడాలు కట్టి వెలిగించి, 'దిబ్బి దిబ్బి దీపావళి' అనే పాట పాడుతారు. ఇంటిని దీపాలతో అలంకరిస్తారు, మట్టి ప్రమిదలు, నువ్వుల నూనె వాడటం మంచిది. లక్ష్మీదేవి పూజ చేస్తే ధన ధాన్యాలు, అష్టైశ్వర్యాలు సంప్రాప్తిస్తాయని వ్యాపారులు నమ్ముతారు.

## భగినీ హస్త భోజనం

ఈ రోజును యమ ద్వితీయ లేదా భాయిదూజ్గా జరుపుకుంటారు. సోదరులు తమ సోదరి చేతి భోజనం తింటే మృత్యు భయాలు తొలగిపోతాయి. యముడు తన సోదరి యమునకు వెళ్లి విందు స్వీకరిస్తాడు, ఇది సోదరీ, సోదరుల మధ్య అప్యాయతను ప్రతిబింబిస్తుంది. దీని ద్వారా, దీపావళి పండుగ మన జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం మరియు ధనాన్ని తీసుకురావాలని ఆశించబడు తుంది







# పొటాటో రోస్ట్ ఇలా తయారు చేయండి

| కావాల్సివి |
|---|
| పది బేబీ పొటాటో |
| 2 చెంచాల నూనె |
| పావు టీస్పూన్ జీలకర్ర |
| పావు టీస్పూన్ ఆవాలు |
| చిటికెడు ఇంగువ |
| కరివేపాకు రెమ్మ |
| 1 ఉల్లిపాయ సన్నటి ముక్కల తరుగు |
| అరచెంచాడు అల్లం వెల్లుల్లి ముద్ద |
| పావు టీస్పూన్ పసుపు |
| అరచెంచాడు కారం |
| అర చెంచా ధనియాల పొడి |
| అర చెంచా గరం మసాలా |
| అర చెంచా ఉప్పు |

రుచిగా ఏదైనా స్నాక్ తినాలనిపిస్తే ఇలా పొటాటో రోస్ట్ చేసుకోండి. పిల్లలకు స్నాక్ లాగానూ, లంచ్ బాక్స్ లోకి పెట్టిచ్చేయొచ్చు. ఈ సింపుల్ స్నాక్ రెసిపీ తయారీ చూసేయండి. బేబీ పొటాటో లేదా ఇంట్లో కాస్త చిన్న సైజు బంగాళదుంపలే మిగిలిపోయినా ఈ పొటాటో రోస్ట్ చేయొచ్చు. ఒక్కోటి నోట్లో పెట్టుకుని స్నాక్ లాగా తినేయొచ్చు. రుచిగా బేబీ పొటాటో రోస్ట్ రావాలంటే ఈ కొలతలు ఫాలో అయిపోండి. కావాల్సిన పదార్థాలేంటో చూడండి.

## తయారీ విధానం

### బంగాళాదుంపలను ఉడికించండి

ప్రెజర్ కుక్కర్లో బంగాళాదుంపలను తొక్కతో సహా వేయండి. మునిగేటన్ని నీళ్లు, కాస్త ఉప్పు వేసి 2 విజిల్స్ వచ్చిన తరువాత ఆపు చేయండి. చల్లారాక, తొక్క తీసి పక్కన పెట్టండి.





### బంగాళాదుంపలను వేయించండి:

కడాయిని వేడి చేసి, 2 చెంచాల నూనె వేసి, ఉడికించిన బంగాళాదుంపలను వేసి బాగా ఫ్రై చేయండి.అవి రంగు మారి, కాస్త క్రిస్పీగా అయ్యేంత వరకు ఫ్రై చేయండి.ఫ్రై చేసిన బంగాళాదుంపలను ప్లేట్‌లోకి తీసుకోవాలి.

### తాలింపు తయారు చేయండి

అదే కడాయిలో మిగిలిన నూనె వేడి చేసి, ఆవాలు, జీలకర్ర, ఇంగువ, కరివేపాకు వేసి తాలింపు పెట్టండి. అవన్నీ వేగాక, తరిగిన ఉల్లి పాయ ముక్కలు మరియు అల్లం వెల్లుల్లి ముద్ద కూడా వేసి, పచ్చి వాసన పోయేదాకా వేయించండి.

### మసాలా జోడించండి

ఉల్లిపాయలు కాస్త రంగు మారాక, కారం, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా, ఉప్పు వేసి బాగా కలుపండి.ఇక, ముందు వేయించిన బంగాళాదుం లను జోడించి, మసాలా బాగా పట్టేలా కలుపుకోవా



**చివరగా:** మీ ఇష్టానుసారం కొత్తిమీర చల్లండి.వేడి వేడి స్పైసీ బేబీ పొటాటో రోస్ట్ రెడీ!ఈ స్నాక్ చాలా రుచికరంగా ఉంటుంది. పిల్లలు మరియు పెద్దలిద్దరూ ఆనందించడానికి అనువైనది!

## తారాజువ్వలా దూసుకెళ్తున్న బంగారం..

### తొలిసారి రూ.82 వేలు పైకి



**న్యూఢిల్లీ:** బంగారం ధర మరోసారి పెరిగింది. దీపావళి వేళ తారాజువ్వలా దూసుకెళ్తోంది. దేశ రాజధానిలో ఢిల్లీలో తాజాగా 10 గ్రాముల మేలిమి పసిడి ధర తొలిసారి రూ.82 వేలు దాటేసింది. దీపావళి డిమాండ్ దృష్ట్యా బంగారు ఆభరణ విక్రేతలు భారీగా బంగారం కొనుగోలు చేయడం బంగారం పెరుగుదలకు కారణమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఢిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం (99.9%) ధర బుధవారం రూ.1000 మేర పెరిగి రూ.82,400కు చేరినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం కూడా రూ.82 వేల మార్కును చేరిందని తెలిపింది. అంతకుముందు స్వచ్ఛమైన పసిడి రూ.81,400గా ఉంది. గతేడాది ఇదే సమయంలో ఢిల్లీలో 10 గ్రామల పసిడి రూ.61,200గా ఉంది. ఏడాదిలో 35 శాతం మేర పెరిగింది. వెండి కిలో సైతం రూ.1300 మేర పెరిగి రూ.1.01 లక్షలకు చేరింది.

దీపావళి వేళ బంగారం కొనుగోళ్లు ఊపందుకుంటాయన్న అంచనాల నేపథ్యంలో స్థానిక వర్తకులు భారీ స్థాయిలో పసిడి కొనుగోళ్లు జరపడం డిమాండ్‌కు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికాలో నవంబర్ 5న అధ్యక్ష ఎన్నికలు పోటాపోటీగా జరిగే అవకాశం ఉందన్న అంచనాలూ అంతర్జాతీయంగా బంగారానికి డిమాండ్ పెరగడానికి కారణమని విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఔన్సు బుధవారం ఇంట్రాడేలో 2797.90 డాలర్ల పలకడం గమనార్హం.

## ఓలా నుంచి మరిన్ని సర్వీస్ సెంటర్లు!



**న్యూఢిల్లీ:** కస్టమర్లకు మెరుగైన సేవలు అందించే దిశగా విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ వేగంగా విస్తరిస్తోంది. అందులో భాగంగా తన సర్వీస్ సెంటర్ల సామర్థ్యాన్ని 30శాతం పెంచుకున్నట్లు తెలుస్తోంది. కొత్తగా 50కు పైగా సర్వీస్ సెంటర్లను, 500 మంది టెక్నీషియన్లను పెంచుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. కస్టమర్ల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న తరుణంలో కంపెనీ కేంద్రాలను, శ్రామిక శక్తిని పెంచుకుంటోంది.

"కంపెనీ తన సర్వీస్ సెంటర్ల సామార్థ్యాన్ని విస్తరించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే మా వద్ద వచ్చిన అనేక సర్వీసు బ్యాక్‌లాక్‌లను పూర్తి చేశాం. రానున్న రోజుల్లో మిగిలిన వాటిని పూర్తి చేస్తాం" అని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. మార్కెట్‌లో తన ఉనికిని పెంచుకోవడంలో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్‌తో ఓలా హైపర్ సర్వీస్ క్యాంపెయిన్‌ను కంపెనీ ప్రారంభించింది. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా ఈఏడాది డిసెంబర్ నాటికి సర్వీస్ సెంటర్ల సంఖ్యను రెట్టింపు చేయాలని (1,000కి పెంచాలని) చూస్తున్నట్లు కంపెనీ సీఈఓ భవీశ్ అగర్వాల్ వెల్లడించారు.

## బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు..

### నష్టాల్లో ముగిసిన సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మిశ్రమ సంకేతాల మధ్య ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు రోజంతా అదే బాటలో పయనించాయి.

సెన్సెక్స్ ఉదయం 80,237.85 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,369.03) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే బాటలో పయనించింది. ఇంట్రాడేలో 79,821.99 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ చివరకు 426.85 పాయింట్ల నష్టంతో 79,942 వద్ద ముగిసింది. నిఫ్టీ 126 పాయింట్లు కుంగి 24,340 వద్ద స్థిరపడింది.

30 సూచీలో ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎంఅండ్ఎం, కోటక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. మారుతీ సుజుకీ, ఇండస్ఇండ్ బ్యాంక్, అదానీపోర్ట్స్, ఐటీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్అండ్‌టీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.61 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా. బంగారం ఔన్సు 2,795.80 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## గూగుల్‌లో 25 శాతం కోడింగ్ 'ఏఐ'తోనే: సుందర్ పిచాయ్



**న్యూఢిల్లీ:** గూగుల్ తన సాఫ్ట్‌వేర్ కోడ్‌ను రూపొందించడానికి కృత్రిమ మేధ పై ఎక్కువగా ఆధారపడుతోందని కంపెనీ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు.

జనరేట్ చేసిన కోడ్‌ను ఇంజినీర్లు రివ్యూ చేస్తున్నప్పటికీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరిగిందన్నారు. గూగుల్ మూడో త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన సందర్భంగా పిచాయ్ ఏఐ గురించి ఆసక్తికర విషయాలను తన బ్లాగ్ పోస్ట్‌లో పంచుకున్నారు.

గూగుల్ మెరుగైన వృద్ధి వ్యూహంలో ఏఐది కీలక పాత్ర అని సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. 'గూగుల్'లో కొత్త కోడింగ్‌లో 25 శాతానికిపైగా కృత్రిమ మేధతోనే సృష్టిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏఐ సాయంతో కోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా.. సమయాన్ని తగ్గించి, ఆవిష్కరణల విషయంలో వేగం పెంచడమే సంస్థ లక్ష్యమని వెల్లడించారు. 'కృత్రిమ మేధ ఆధారిత కోడింగ్ ప్రక్రియ అనేది.. సంస్థ కార్యకలాపాల క్రమబద్ధీకరణలో ఓ భాగం. జెమినీ వంటి కొత్త మోడళ్లను మరింత వేగంగా తీసుకొచ్చేలా.. పరిశోధన, మెషిన్ లెర్నింగ్, సెక్యూరిటీ విభాగాలతోపాటు ఆయా ప్లాట్‌ఫామ్, డివైస్‌లకు చెందిన సిబ్బందిని ఏకీకృతం చేసింది' అని ఆయన తెలిపారు.

గూగుల్ ఏఐ వినియోగం మరింత విస్తరిస్తోందన్నారు. ఏఐ కోపైలట్ ద్వారా జెమినీని అందుబాటులో తీసుకొచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న డెవలపర్లకు ఏఐ టూల్స్ అందుబాటులోకి తేవడమే దీని వెనుక ఉన్న ఉద్దేశమని అన్నారు.



## మూడో టెస్టులో హర్షిత్ రాణా

# అరంగేట్రం..

### క్లారిటీ ఇచ్చిన కోచ్



**ముంబై:** న్యూజిలాండ్‌పై రెండు టెస్టుల్లో ఓటమిపాలై.. 12 ఏళ్ల తర్వాత తొలిసారిగా స్వదేశంలో టీమ్‌ఇండియా సిరీస్ కోల్పోయింది. ఈ నేపథ్యంలో ముంబయి వేదికగా జరిగే చివరి టెస్టులో రోహిత్ సేన భారీ మార్పులతో బరిలోకి దిగుతుందని అంతా భావించారు. అయితే.. టీమ్‌ఇండియా ఎలాంటి మార్పులు లేకుండా అదే జట్టుతో ఆడనున్నట్లు తెలుస్తోంది.

న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌కు ట్రావెల్ రిజర్వ్‌గా కేకేఆర్ పేసర్ హర్షిత్ రాణాను తీసుకున్నారు. మూడో టెస్టు కోసం అతడిని జట్టులోకి తీసుకుని అరంగేట్రం చేయిస్తారని వార్తలు వచ్చాయి. అయితే.. వీటిపై టీమ్‌ఇండియా అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ స్పందించాడు. కివీస్‌తో జరిగే చివరి మ్యాచ్‌లో హర్షిత్ రాణాను జట్టులోకి తీసుకోవడం లేదని తెలిపాడు. రెండో టెస్టులో ఆడిన జట్టుతోనే రోహిత్ సేన ఆఖరి టెస్టుకు సిద్ధమవుతుందని వెల్లడించాడు.

"జట్టులో ఎలాంటి చేరికలు లేవు. ప్రతి వారం ముఖ్యమే. ప్రతి రోజు కీలకమే. గురించి మేం ఎలాంటి సంకుచిత ఆలోచనలు చేయడం లేదు. చివరి టెస్టుపై మేం దృష్టి పెట్టాలనుకుంటున్నాం" అని ముంబయి మ్యాచ్‌కు ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అభిషేక్ నాయర్ వెల్లడించాడు.

వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న ప్రతిష్ఠాత్మక బోర్డర్-గావస్కర్ ట్రోఫీ కోసం ప్రకటించిన జట్టులో హర్షిత్ రాణాకు చోటు దక్కిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో న్యూజిలాండ్‌తో జరిగే మూడో టెస్టులో అతడికి అవకాశం కల్పిస్తారని వార్తలు వచ్చాయి.

**ఆ అనవసరపు రికార్డు వద్దు..**
**చివరి మ్యాచ్‌లోనైనా గెలవండి : ఆకాశ్ చోప్రా**

న్యూజిలాండ్‌పై వరుసగా రెండు టెస్టుల్లో ఓటమిపాలై.. 12 ఏళ్ల తర్వాత స్వదేశంలో టీమ్‌ఇండియా సిరీస్‌ను కోల్పోయిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ముంబయి వేదికగా జరిగే మూడో టెస్టుపై అందరి దృష్టి నెలకొంది. ఆ మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు నిలుపుకోవాలని భారత అభిమానులు కోరుతున్నారు. చివరి టెస్టునూ కోల్పోయి అనవసరపు రికార్డును తమ ఖాతాలో వేసుకోవద్దని పలువురు సూచిస్తున్నారు.

మూడో టెస్టులోనైనా టీమ్‌ఇండియా విజయం సాధించాలని మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా కోరాడు. ఇప్పటివరకూ సొంత గడ్డపై టీమ్‌ఇండియా 0-3 తేడాతో టెస్టు సిరీస్‌ను కోల్పోలేదని.. అపఖ్యాతిని తెచ్చే ఇలాంటి రికార్డును సృష్టించవద్దని ఆటగాళ్లకు సూచించాడు.

'టీమ్‌ఇండియా స్వదేశంలో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఎప్పుడూ వైట్‌వాష్ కాలేదు. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో ఒకసారి అలా జరిగింది. కానీ, మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఎప్పుడూ అలా జరగలేదు. అలాంటి రికార్డును బ్రేక్ చేయొద్దు. దయచేసి చివరి మ్యాచ్ గెలవాలని కోరుతున్నాను. ఎందుకంటే పాయింట్లు కూడా మనకెంతో ముఖ్యం. ఈ మ్యాచ్ గెలిస్తే 33 శాతం పాయింట్లు మనకు లభిస్తాయి. ఇక హెడ్ కోచ్‌గా గౌతం గంభీర్ పదవీ కాలంలో ఇప్పటికే అనవసరపు రికార్డులు ఉన్నాయి. మరొకటి చేర్చకండి" అని ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానల్‌లో సూచించాడు

గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆగస్టులో శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్ ను టీమ్‌ఇండియా కోల్పోయింది. ఆ తర్వాత బంగ్లాదేశ్‌తో టీ20, టెస్టు సిరీస్‌లను క్లీన్ స్వీప్ చేసింది. అయితే.. తాజాగా స్వదేశంలో కివీస్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌ను మాత్రం మరో మ్యాచ్ మిగిలి ఉండగానే కోల్పోయింది. బెంగళూరు, పుణె టెస్టుల్లో ఓటమి పాలైన రోహిత్ సేన.. ముంబయి వేదికగా నవంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న ఆఖరి టెస్టు ఆడనుంది.

## ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో బుమ్రాను దాటేసి

# అగ్రస్థానంలోకి రబాడా




**న్యూఢిల్లీ:** ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కాగిసో రబాడా అరుదైన ఘనత సాధించాడు. భారత స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాను దాటేసి అగ్రస్థానంలోకి దూసుకెళ్లాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో అద్భుతంగా రాణిస్తున్న రబాడా ఇటీవల బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు మ్యాచ్‌లో 300 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. దాంతో టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆయనకు అగ్రస్థానం దక్కింది.

29 ఏళ్ల రబాడా బంగ్లాతో జరిగిన రెండు టెస్టుల్లో 9 వికెట్లు తీయడం ద్వారా దక్షిణ్రికా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతేగాక జస్ప్రీత్ బుమ్రా, జోష్ హాజిల్‌వుడ్, రవిచంద్రన్ అశ్విన్‌లను దాటేసి టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం దక్కించుకున్నాడు. ప్రస్తుతం హాజిల్‌వుడ్ రెండో స్థానంలో, బుమ్రా మూడో స్థానంలో, అశ్విన్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. కాగా 2019 తర్వాత రబాడా అగ్రస్థానంలో రావడం ఇదే తొలిసారి.

2018 జనవరిలో తొలిసారి ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో టాప్-10 లోకి వచ్చిన రబాడా ఆ తర్వాత వరుసగా ఏడాదిపాటు టాప్-10 లో కొనసాగుతూ వచ్చాడు. 2019 ఫిబ్రవరిలో అగ్రస్థానంలోకి దూసుకెళ్లాడు. ఆ తర్వాత మళ్లీ రబాడా అగ్రస్థానంలోకి రావడం ఇదే తొలిసారి. ఇదిలావుంటే పాకిస్థాన్ స్పిన్నర్ నొమాన్ అలీ తొలిసారి టాప్-10 జాబితాలో చోటు సంపాదించాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టెస్టులో 9 వికెట్లు తీయడం ద్వారా నొమాన్ ఏకంగా 8 స్థానాలు ఎగబాకి టాప్ టెన్‌లోకి దూసుకొచ్చాడు. ప్రస్తుతం అతను జాబితాలో 9వ స్థానంలో కొనసాగుతున్నాడు.

## మళ్లీ ఆర్సీబీ కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ !




**ముంబై:** రాబోయే ఐపీఎల్ సీజన్(2025)కు చెందిన ప్లేయర్ల రిటెన్షన్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. గురువారమే రిటెన్షన్‌కు చివరి తేదీ. దీంతో పలు ఫ్రాంచైజీలు కొత్త ప్లేయర్ల కోసం ఎదురుచూస్తున్నాయి. అయితే కొందరు ఆటగాళ్లు మాత్రం పాత ఫ్రాంచైజీలకే ఫిక్స్ అయ్యేందుకు సిద్ధపడ్డారు. ఇక బెంగుళూరు రాయల్ ఛాలెంజర్స్ జట్టుకు .. విరాట్ కోహ్లీ కెప్టెన్సీ పగ్గాలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఐపీఎల్ 2021లో ఆర్సీబీ కెప్టెన్సీని విరాట్ వదులుకున్నాడు. ఆ తర్వాత నుంచి డూప్లెసిస్ ఆ జట్టుకు నాయకత్వం వహించాడు. అయితే ఈసారి కొత్త కెప్టెన్ కోసం ఆర్సీబీ ప్రయత్నించినట్లు తెలిసింది. గుజరాత్ టైటాన్స్‌కు చెందిన శుభమన్ గిల్‌ను ఆర్సీబీకి రప్పించే ప్రయత్నాలు జరిగాయి. కానీ గిల్ తన పాత ఫ్రాంచైజీతో కొనసాగేందుకు మొగ్గుచూపినట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో విరాట్ కోహ్లీకి ఆర్సీబీ సారథ్య బాధ్యతలు దక్కే అవకాశాలు ఉన్నాయి.

# గ్యారీ కిరిస్టెన్ రాజీనామా..

### హర్భజన్ చెప్పిందే నిజమైంది!

**కరాచీ:** పాకిస్థాన్ క్రికెట్ జట్టు పరిమిత ఓవర్ల కోచ్‌గా వ్యవహరించిన గ్యారీ కిరిస్టెన్ కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే పదవికి రాజీనామా చేయడం క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీసింది. అయితే, మూడు నెలల కిందటే కిరిస్టెన్‌కు భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ కీలక సూచన చేశాడు. ఇప్పుడు అదే నిజం కావడంతో సోషల్ మీడియాలో అప్పటి వ్యాఖ్యలు మరోసారి వైరల్‌గా మారాయి. హర్భజన్ చెప్పిందే నిజమైందంటూ కామెంట్లు వస్తున్నాయి. ఈసందర్భంగా ఓ అభిమాని పెట్టిన పోస్టుకు హర్భజన్ స్పందించడం గమనార్హం. ఇంతకీ ఆ అభిమాని ఏమని పోస్టు పెట్టాడంటే?

'హర్భజన్‌సింగ్‌కు ముందే గ్యారీ కిరిస్టెన్ పరిస్థితి తెలుసు. పాకిస్థాన్ క్రికెట్ జట్టుతో ఉండలేడు. భారత్ రెండోసారి వన్డే ప్రపంచకప్‌ను సాధించడంలో ధోనీకి అండగా నిలిచిన కిరిస్టెన్ కేవలం నాలుగు నెలల్లోపే వెళ్లిపోవడం ఎవరినీ ఆశ్చర్యానికి



గురిచేయలేదు. గౌతమ్ గంభీర్ కోచ్‌గా అనుకోకముందు.. కిరిస్టెన్‌ను భారత జట్టు ప్రధాన కోచ్ పదవికి రమ్మని హర్భజన్ సూచించాడు" అని సదరు అభిమాని పోస్టు పెట్టాడు. దానికి భజ్జీ స్పందిస్తూ.. నవ్వుతున్న ఎమోజీలతో రీ పోస్టు చేశాడు.

గ్యారీ కిరిస్టెన్ పాకిస్థాన్‌కు కోచ్‌గా నియమితులైన సందర్భంగా హర్భజన్ ఓ పోస్టు పెట్టాడు. ఎంత త్వరగా పాక్‌ను వీడితే అంత బాగుంటుందని.. ఆ జట్టుతో ఉండలేవంటూ పేర్కొన్నాడు. "గ్యారీ నీ సమయాన్ని వృథా చేసుకోవద్దు. భారత జట్టుకు కోచ్‌గా వచ్చేయ్' అని పోస్టు చేశాడు. అప్పటికి గంభీర్‌ను నియమిస్తారని ఎవరికీ తెలియదు. దీంతో భారత ఆటగాళ్లతో మంచి అనుబంధం కలిగిన గ్యారీని మరోసారి కోచ్‌గా రమ్మని హర్భజన్ సూచించాడు.

**కొత్త కోచ్ రేసులో..**

గ్యారీ కిరిస్టెన్ వైదొలగడంతో అతడి స్థానంలో జాసెన్ గిలెస్పీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం గిలెస్పీ టెస్టు జట్టు కోచ్ ఉన్నాడు. వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ నేపథ్యంలో పూర్తిస్థాయి కోచ్‌ను నియమించే అవకాశాలు లేకపోలేదు. ఇప్పటికే కొత్త సారథిగా మహ్మద్ రిజ్వాన్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే.

# హనుమంతుడిగా రిషబ్ శెట్టి..
# కలెక్షన్ల సునామీ తప్పదా?

ఎప్పుడా ఎప్పుడా అని యావత్ హనుమాన్ సినిమా లవర్స్ అందరూ ఆసక్తికరంగా ఎదురు చూస్తున్న జై హనుమాన్ సినిమా అప్డేట్ వచ్చేసింది. ముందుగా ప్రకటించినట్టుగానే ప్రశాంత్ వర్మ 5:49 నిమిషాలకు ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. గత కొన్నాళ్లుగా ఈ సినిమాలో రిషబ్ శెట్టి ఆంజనేయ స్వామి పాత్రలో కనిపించబోతున్నారనే ప్రచారం జరిగింది. ఇప్పుడు ఆ ప్రచారాన్ని నిజం చేస్తూ ఆంజనేయస్వామి లుక్ లో రాముడు విగ్రహాన్ని హత్తుకుని ఉన్న ఒక ఫస్ట్ లుక్ పోస్టర్ ని షేర్ చేశారు జై హనుమాన్ సినిమా మేకర్స్. ఇక ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ మీద నవీన్ ఎర్నేని, ఎలమంచిలి రవిశంకర్ నిర్మించబోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి రిలీజ్ అయిన హనుమాన్ సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తేజ సజ్జ హీరోగా నటించిన ఈ సినిమాకి 300 కోట్లకు పైగా కలెక్షన్స్ వచ్చాయి. దానికి సీక్వెల్ గానే ఈ జై హనుమాన్ సినిమా అనౌన్స్ చేశారు. అయితే 2025 సంక్రాంతికి ఈ సినిమా రిలీజ్ చేయాలని ముందు ప్లాన్ చేసుకున్న ఇప్పటివరకు అందుకు తగ్గ ప్రయత్నాలు అయితే లేవు. ఈ దీపావళిని హనుమాన్ చాలీసాతో ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవాలని అంటూ ప్రశాంత్ వర్మ ట్వీట్ చేశారు. ఇక ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ అయితే రిషబ్ శెట్టి ఆంజనేయుడుగా కరెక్ట్ గా సెట్ అయ్యాడు అంటూ కామెంట్ చేస్తున్నారు.




# రవితేజ, శ్రీలీల మూవీకి టైటిల్ ఫిక్స్

రవితేజకు సరైన హిట్ పడక చాలా రోజులైంది. ఇక శ్రీలీల పరిస్థితి కూడా అంతే. ఓ దశలో శ్రీలీల బిజీ హీరోయిన్ గా మారిపోయింది. కానీ అంతలోనే రెండు ఫెయిల్యూర్ ఖాతాలో పడటంతో డౌన్ అయిపోయింది. ఇప్పుడు వీరిద్దరికీ హిట్లు కావాలి... వీరిద్దరూ జంటగా నటిస్తున్న చిత్ర ఆర్టీ 75. భాను బోగవరపు దర్శకత్వం వహిస్తున్నాడు. దీపావళి సందర్భంగా ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మూవీ లవర్స్ రవితేజను మాస్ మహారాజా అని పిలుస్తుంటారని తెలిసిందే. ఈ చిత్రానికి రవితేజ మ్యానరిజాన్ని ప్రతిబింబించేలా మాస్ జాతర టైటిల్‌ను ఫైనల్ చేశారు. రవితేజ ఓ వైపు పిస్తోల్, మరోవైపు చేతిలో గంట పట్టుకొని ఉండగా.. బ్యాక్ డ్రాప్‌లో జాయింట్ వీల్ కనిపిస్తోంది. అవుట్ అండ్ అవుట్ మాస్ జాతర.. సూపర్ హైప్ క్రియేట్ చేసే వినోదంతో స్క్రీన్లు బద్దలు కాబోతున్నాయి. మాస్ జాతర 2025 మే 9న విడుదల కాబోతుందని తెలియజేశారు. ఈ సినిమాతో సామజవరగమన ఫేం రైటర్ భాను బొగవరపు డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. పేరు లక్ష్మణ భేరి.. ఆదాయం చెప్పను తియ్.. ఖర్చు లెక్క జెయ్యన్.. రాజ్యపూజ్యం అన్ లిమిటెడ్..అవమానం జీరో అంటూ ఇప్పటికే ఆర్టీ75పై అంచనాలు పెంచేశారు మేకర్స్. ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య తెరకెక్కిస్తున్నారు. బలగం ఫేమ్ భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు.



# సీతమ్మగా నటించడం నా అదృష్టం: సాయిపల్లవి




శివ కార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం 'అమరన్'. మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితాన్ని ఆధారంగా చేసుకుని రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కించారు. గురువారం ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో సాయిపల్లవి తాజాగా తెలుగు ప్రమోషన్స్‌లో పాల్గొన్నారు. 'అమరన్' విశేషాలతోపాటు తన తదుపరి ప్రాజెక్ట్‌ల గురించి తెలియజేశారు. మేజర్ ముకుంద్ కుటుంబాన్ని కలిసినప్పుడు తాను ఏవిధంగా ఫీలయ్యారో చెప్పారు. "మేజర్ ముకుంద్ వరదరాజన్ కుటుంబాన్ని కలిశా. ఎన్నో విషయాలు అడిగి తెలుసుకున్నా. బాధగా ఉన్నప్పటికీ ఆ సమయంలో ఏమాత్రం కన్నీళ్లు పెట్టకూడదని నిర్ణయించుకున్నా. తమ బిడ్డ దేశం కోసం ప్రాణాలు అర్పించాడని వాళ్లు ఎంతో గర్వంగా చెప్పారు. ఇదే విషయాన్ని ముకుంద్ తండ్రి వరదరాజన్ ఎక్కడికి వెళ్లినా గర్వంగా చెబుతుంటారు. వాళ్లకి లోలోపల ఎంతో బాధ ఉంటుంది. కాకపోతే బయటకు చూపించరు. వాళ్ల గురించి ఎంత చెప్పినా తక్కువే" అని సాయిపల్లవి చెప్పారు. ఈ సినిమా అవకాశం వచ్చినప్పుడు.. నా పాత్ర ఎలా ఉంటుంది? ఎంత నిడివి ఉంటుంది? అని ఎక్కువగా ఆలోచించలేదు. ఇది నాకు చాలా ముఖ్యం అనుకున్నా అంతే అని తెలిపారు. అనంతరం ఆమె 'రామాయణ' గురించి మాట్లాడారు. "ఈ మూవీ గురించి ఇప్పుడే ఏమీ చెప్పలేను. కాంట్రాక్ట్ ఉంది. ప్రతి సినిమాలో నా వ్యక్తిగత ఎదుగుదల చూస్తుంటా. ఆయా కథల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకుంటా. చిన్నప్పటి నుంచి వింటూ పెరిగిన కథల్లో రామాయణం ఒకటి. సీతమ్మ పాత్రలో నటించే అవకాశం రావడం నా భాగ్యం. భయాన్ని పక్కనపెట్టి.. సీతమ్మగా మారాలని నిర్ణయించుకున్నా. నటిగా కాకుండా భక్తురాలిగా ఆ రోల్ చేస్తున్నా" అని పేర్కొన్నారు. బాలీవుడ్ దర్శకుడు నితేశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా దీనిని తెరకెక్కిస్తున్నారు. శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ కనిపించనున్నారు. రావణుడిగా యశ్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది.

# నవంబర్ 18 నుంచి నయన్ డాక్యుమెంటరీ స్ట్రీమింగ్

నయనతార పడుతూ లేస్తూ జీవితంలో ముందుకు సాగిన నటి. కాగా నెట్ ఫ్లిక్స్ ఈమె జీవితం ఆధారంగా డాక్యుమెంటరీ సిద్ధం చేసిన విషయం తెలిసిందే. ఈ డాక్యుమెంటరీ నవంబర్ 18 నుంచి నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కాబోతున్నది. అగ్ర కథానాయిక నయనతార జీవితంపై డాక్యుమెంటరీ ఫిల్మ్ సిద్ధమైన విషయం తెలిసిందే. ఆమె వృత్తి, వ్యక్తిగత జీవితంపై ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దీనిని రూపొందించింది. ఇప్పటికే విడుదలైన ప్రోమో సినీప్రియులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈనేపథ్యంలో తాజాగా ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన పలు విశేషాలను ఓటీటీ సంస్థ ప్రకటించింది. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. నవంబర్ 18 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది.

అనుకోకుండా సినిమాల్లోకి అడుగుపెట్టారు నయనతార. కాలేజీ రోజుల్లో ఆమె పార్ట్‌టైమ్ మోడల్‌గా వర్క్ చేశారు. ఓ సందర్భంలో ఆమెను చూసిన దర్శకుడు సత్యన్ అంతికాడ్.. 'మనస్సిక్కరే'లో నటిగా అవకాశం ఇచ్చారు. తొలుత దానిని తిరస్కరించిన ఆమె చివరకు ఓకే చెప్పారు. 2003లో ఇండస్ట్రీలోకి వచ్చిన నయన్.. మలయాళం, తమిళం, తెలుగులో వరుస చిత్రాల్లో యాక్ట్ చేశారు. స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. కెరీర్ పరంగా ఎన్నో అవమానాలు, ఎత్తుపల్లాలు చూశారు. 'నేను రౌడీనే' సమయంలో దర్శకుడు విఘ్నేశ్ శివన్‌తో పరిచయం ఏర్పడింది. కొంతకాలానికి వీరి మధ్య ప్రేమ మొదలైంది. కొన్నేళ్లపాటు ప్రేమించుకున్న నయన్ - విఘ్నేశ్ పెద్దల అంగీకారంతో 2022లో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. నయనతార చిన్నప్పటినుంచి పెళ్లివరకూ సాగే ప్రయాణాన్ని ఈ డాక్యుమెంటరీలో చూపించనున్నారు. పెళ్లి వేడుక డిజిటల్ రైట్స్ కోసం నెట్‌ఫ్లిక్స్ రూ.25 కోట్లు చెల్లించినట్లు సమాచారం. రెండేళ్ల క్రితం దీని ప్రోమో విడుదల చేశారు. నయన గొప్ప నటి మాత్రమే కాదని.. మంచి మనసున్న వ్యక్తి అందులో విఘ్నేశ్ తెలిపారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.